ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
2 అక్టోబర్, 2011
Entered
బైక్ క్రేజ్...

హ్యాపీబర్త్‌డే

(2011 అక్టోబర్ 2నుంచి
2011 అక్టోబర్ 8 వరకు)

బి. జీవన్
5సం॥, అక్టోబర్-3
అనురాధ-రవిచంద్రబాబు
బొమ్మనంపాడు-ప్రకాశం



ఎ. వెంకటసాయి శరత్
5సం॥, అక్టోబర్-7
శివరాణి-గురుప్రసాద్
కంకిపాడు-కృష్ణా

ఎన్. అక్షిత
1సం॥, అక్టోబర్-6
పుష్పలత-మత్యగిరి
అనాజిపురం-నల్లగొండ

సి. ప్రణీత్‌కుమార్
5సం॥, సెప్టెంబర్-2006
పల్లవి-వెంకటేష్
పరిగి-రంగారెడ్డి

కె. ప్రతిభ
అక్టోబర్-7
రమాదేవి-రాజన్న
అడ్డగుట్ట-సికింద్రాబాద్

స్వీటీ
అక్టోబర్-5
సుభాషిణి-ఏసు
శనాయ్‌నగర్-మద్రాసు

ఎన్. శ్రీయ
2సం॥, అక్టోబర్-3
కిరణ్మయి-లెనిన్‌బాబు
అమెరికా

ఎం. ధృవ(అక్షిత)
2సం॥, అక్టోబర్-4
మమత-రాజశేఖర్
మన్‌సురాబాద్-హైదరాబాద్



సృజన్
1సం॥, అక్టోబర్-3
జ్యోతి-సుధాకర్
దేవరుప్పుల-వరంగల్

ఎన్. సిద్ధు
2సం॥, అక్టోబర్-2009
సంధ్య-మణి
తిరుచానూరు-తిరుపతి

బి. అభినవబృందా రాయలు
1సం॥, అక్టోబర్-3
రామసీత-కృష్ణరాయలు
విజయవాడ

టి. నాగకావ్యశ్రీ
7సం॥, అక్టోబర్-4
రాధ-నాగేశ్వరరావు
వెంకటయ్యపాలెం-ఖమ్మం

కె. పూజిత
3సం॥, అక్టోబర్-2008
పద్మావతి-శ్రీనివాస్
ఏలూరు

జి. సంధ్య
అక్టోబర్-2
భారతమ్మ-అంజయ్య
లక్ష్మీనారాయణపురం-వరంగల్

జి. వర్షిత్
2సం॥, అక్టోబర్-8
కవిత-మురళీకృష్ణ
రేపల్లె-గుంటూరు

పి. భానుతేజ
2సం॥, అక్టోబర్-2009
సుజిత-కిరణ్
బుచ్చిరెడ్డిపాలెం-నెల్లూరు

డి. సాయిరామ్
4సం॥, అక్టోబర్-5
రజని-రాజేష్

యు. శశిధర్
అక్టోబర్
నాగదివ్యకుమారి-ఉమామహేశ్వరరావు
ఎర్రకొండ-తూ॥గో

మనలో మాట

మందు రాజ్యం

అనగనగా ఓ తెలుగు రాజ్యం. అచ్చోట..పాలకులకు ప్రజలంటే వల్లమాలిన అభిమానాలు. ఎంత అంటే మాటల్లో చెప్పలేనంత! కోరిన మరుక్షణమే 'కిక్కు' ప్రాప్తిరస్తు మస్తు అనేంత. ఇరుగుపొరుగు రాజ్యాల జనులకు కళ్లు కుట్టేంత. తెలుగునాట పుట్టనందుకు 'ఫుల్లు' బాధపడేంత.

'కిక్కు' రహస్యం విప్పడానికి వేగులు వాయువేగంతో బయల్దేరారు. తెలుగునాట కాలూనిన మరుక్షణమే గమ్మత్తైన అనుభూతి. ఆ మత్తు మట్టిలో వుందో? ముక్కుకు సోకిన ప్రాణవాయువులో వుందో! ముందుకు అడుగులేస్తూ వుంటే తెల్సింది. అడుగడుగునా వుందని. అనుక్షణం మందని. ఈ రాజ్యంలో ఏటిఎం అంటే 'ఎనీ టైమ్ మందు' అన్న అర్థంగా మారిపోయింది. ఇల్లు, గుడి, బడి, మసీదు, చర్చి ఏవీ దానికి అడ్డం కావు. ఎక్కడ పడితే అక్కడ ఏటీఎంలే ఏటిఎంలు. 'కాసులిచ్చుకో దోసు పుచ్చుకో' పథకం సూపర్ సక్సెస్. 'తాగండి తూగండి' నినాదం యమ జోష్‌లో వినిపిస్తోంది. మండు వేసవిలో సైతం మంచినీళ్ల సంగతి పట్టదుగానీ మందు మాత్రం తాగినంత. తూగినంత. తాగి తూగి దొర్లినంత. బందులు గిందులు ఏం జరిగినా మందు అందినంత. సెలవునాడూ సిద్ధమే. పండుగలు, పబ్బాలకు ప్రత్యేక సరఫరా. ఇక ఓట్ల పండగైతే 'మందా'ర్పణమే. పరీక్ష పాసైతే పార్టీ. ఉద్యోగం వస్తే పార్టీ. పెళ్లి చూపులైతే పార్టీ. పిల్ల నచ్చితే పార్టీ. తాంబూలాలు పుచ్చుకుంటే పార్టీ. పెళ్లికి ముందు పార్టీ. పెళ్లిలో పార్టీ. పెళ్లయ్యాక పార్టీ. పార్టీల మీద పార్టీలు. బోల్డెన్ని మందు పార్టీలు. అధికార రాజకీయ పార్టీల సంగతి సరేసరి. అమ్మేదీ, అమ్మించేదీ అంతా పదవీపతులే. వారి వందిమాగధులే. ఇక సర్కారువారికిది కల్పతరువే. మాంచి ఆదాయవనరే.

వేగుల చూపు మందుబాబుల ఇళ్లపై పడింది. ఆడపడుచులను ఆరాతీశారు. ఇంకేముంది! ముందు మొగుళ్లను, తర్వాత మందును, ఆ తర్వాత మందు షాపులను చేటలో వేసి చెరిగినంత పనిచేశారు. తమ కష్టాలు, కన్నీళ్లకు ఆ మాయదారి మందు పోషిస్తున్న పాత్రను కళ్లకు కట్టారు. ఆ 'పుణ్యం' అమాత్యులదేనన్నారు. ఇప్పుడు కాకున్నా ఎప్పటికైనా అంతకు అంత బుద్ధి చెప్పే తీరుతామన్నట్టున్నాయి వారి చూపులు.

అక్కడి నుంచి నేతల నీడలా మసిలారు వేగులు. నేతల తెతేలకేం (తెలివితేటలు) తక్కువ? 'అక్కలూ...చెల్లెళ్లూ...మా ఇంటి ఆడపడుచులూ...తాగుబోతు మొగుళ్లకు మీరే బుద్ధిచెప్పాలి. దెబ్బకు వెయ్యి రూపాయల చొప్పున కానుక ఇస్తాం' అంటూ ప్రకటనలు గుప్పించారు. మందుబాబులకేమోగానీ వేగులకు మాత్రం మందు సూత్రం...మంత్రుల మంత్రం బాగా అర్థమైంది. ఓ వైపు మందు అమ్మేదీ వారే. తాగితే తన్నమనేదీ వారే. ప్రజలపట్ల వారి 'ప్రేమ' ఎందుకో కూడా అర్థమైంది!

అంతే వేగులు తెలుగు రాజ్యానికి వచ్చినంత వేగంగా తిరుగు టపా కట్టేశారు.

★

ఈ సంచికలో....

టపా	...	2
వికాసం	...	3
కవిత్వమ్	...	4
అట్టమీది కథ	...	14
ఎవరిగోల వారిది	...	17
ఈ పేజ్	...	18
బాలనేస్తాలు	...	22
రుచి	...	24

ఇంకా...

కథ ... 6

బడ్జెట్

ప్రత్యేకం ... 8

గాయాలపై
కారం చల్లిన మోడీ

చూద్దామా ... 12

వావ్! మమ్మీలు!!

సినిమా కబుర్లు ... 20

నాయికల
జీవిత చిత్ర మాలిక



అప్రమత్తతతో మెలగాలని...

పొద్దున లేస్తే సాయంత్రం నిద్రపోయేవరకూ ఒకటే పరుగు. చుట్టూ ఉన్న యాంత్రిక జీవన పోరాటంలో మనం దేనికోసం, ఎవరికోసం జీవిస్తున్నామో కూడా ఆత్మ పరిశీలన చేసుకోలేనంత వేగంగా నేటి బతుకులు గడుస్తున్నాయి. ఈ వాస్తవాన్ని 'మనలో మాట' చక్కగా ఆవిష్కరించింది. సోమిశెట్టి 'సామెత చెప్పినట్లు' కవిత ప్రస్తుత సమాజ రుగ్మతలను సునిశిత హాస్యంతో ఎండగట్టింది. శాస్త్ర సాంకేతికాభివృద్ధితో బాటు మోసాలు కూడా ఆధునికతను సంతరించుకుంటున్న వైనాన్ని 'శతకోటి దరిద్రాలు.. తస్మాత్ జాగ్రత్త' కవితలు సజీవ ఉదాహరణలతో పాఠకులను అప్రమత్తం చేస్తున్నాయి. మనిషి ఉన్నంత కాలం సమస్యలుంటాయి. దానికి పరిష్కారం ఆత్మహత్య కాదు. ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రణాళికాబద్ధ ఆలోచన అవసరం. ఆత్మవిశ్వాసానికి మానసిక పరిపక్వత ముఖ్యం. వీటికోసం తల్లిదండ్రులు, గురువులు నేర్పించే నైతిక విలువలు, పరిసరాలు తోడ్పడతాయని 'మూడోసారి...' కథ ద్వారా యర్నాగుల సుధాకరరావు, 'ఆత్మహత్యే పరిష్కారమా?' ద్వారా సి.వి. సర్వేశ్వర శర్మ తమదైన శైలిలో చెప్పారు. ప్రస్తుతం ఏ అవినీతి కుంభకోణాల్లోనైనా మారుమోగుతున్న పేరు సి.బి.ఐ. దాని పుట్టుక, పనిచేసే విధానం గురించిన అనేక సందేహాలను 'సి.బి.ఐ... ఏ కేసైనా సై' తీర్చింది.

భైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

ఎవర్నీ లెక్క చేయరా?!

పాత సినిమాలు అందించిన వినోదం తిరిగి రాదు. ఇవాళ సినిమాల్లో మంచి కథలు లేవు. పైగా కొన్ని సినిమాల్లో వినోదానికి బదులు వికృత చేష్టలు వస్తున్నాయి. సినిమా కబుర్లలో రెంటాల గారు ఆనాటి సినీ కబుర్లను చక్కగా అందిస్తున్నారు. 'వైతిరి వృక్షాల'ను చూడాలని ఉంది. ఆ ఇళ్లు చాలా బాగున్నాయి. 'అట్టమీది కథ' ద్వారా సి.బి.ఐ గురించి ఎన్నో విషయాలను అందించారు. సి.బి.ఐకి స్వయం ప్రతిపత్తి వుంటే బావుంటుంది. 'కవిత'లన్నీ బాగున్నాయి. చిన్న కథ 'మఠాధికారి' బాగుంది. ఈ కథ చదివాక భూస్వాములు దేవుడ్నైనా శాసిస్తారేమో?! అనిపించింది. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు. అవి వచ్చినప్పుడు నిబ్బరంగా నిలబడి పరిష్కరించుకున్నప్పుడే విజయం వరిస్తుంది.

బొడ్డేపల్లి కనకలక్ష్మి,
ఆముదాలవలస.

ఎన్నో కొత్త విషయాలు

సి.బి.ఐ చరిత్రను రచయిత చక్కగా వివరించారు. ఎన్నో కొత్త విషయాలను ఈ వ్యాసం ద్వారా తెలుసుకున్నాం. రోమియోని చూశాక పొట్టివాడైనా గట్టివాడనిపిస్తుంది. 'చిన్నకథ' బాగుంది. పాస్టరైనా, మరెవరైనా ధనవంతుడి ముందు తల వంచాల్సిందేనా?!

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

వింత అనుభూతి

'చూద్దామా'లో వైతిరి వృక్షాల గురించి చక్కగా వివరించారు. చెట్లపై నివాసం, పక్షులతో సహవాసం వింత అనుభూతిని కలిగిస్తుంది.

నూతి నారాయణరావు,
హైదరాబాద్.

ఆ బాధ్యత పెద్దలదే...



'అట్టమీది కథ' ద్వారా సి.బి.ఐ పనితీరు గురించి అవగాహన కలిగించారు. చిన్న కథ 'మఠాధికారి' బాగుంది. ఆత్మహత్య దేనికీ పరిష్కారం కాదని 'వికాసం' శీర్షిక ద్వారా తెలిపారు. 'బాల నేస్తాలు'లో చిత్రవిచిత్రం బాగుంటోంది. కండల వీరుడు రోమియో విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. 'కవిత్వమ్' పేజీలో కవితలన్నీ నవతర భావపరంపరలను వెదజల్లుతూ ఆకట్టుకుంటున్నాయి. 'సినిమా కబుర్ల' ద్వారా పాత తరం సంగతులు తెలుస్తున్నాయి. పాటల ప్రియులు సంగీత సాగరంలో ఓలలాడడానికి అవసరమైన సమాచారాన్ని 'ఈ పేజ్' అందించింది. 'కొత్త పుస్తకాల' ద్వారా విలువైన పుస్తకాలెన్నింటినో పరిచయం చేస్తున్నారు. 'ఎవరిగోల వారిదే' శీర్షిక బాగుంటోంది. 'మనలోమాట'లో చెప్పినట్లు వేగం ఎప్పటికైనా అనర్థదాయకమే. ఈ విషయాన్ని పిల్లలకు చెప్పి ఆచరించేలా చెయ్యాల్సిన బాధ్యత పెద్దలదే.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.





విశాసం

విశ్రాంతి అవసరం!



కొందరు రాత్రి చీకటిని తిట్టుకుంటారు. నిద్ర కోసం సమయం వృధా అవుతోందని బాధపడతారు. రాత్రి కూడా పనిగంటలు పూర్తిగా ఉంటే మరింత డబ్బు సంపాదించుకోవచ్చని భావిస్తుంటారు. కానీ...ఈ ఆలోచన సరైనది కాదు. నిద్ర అనేది అలసిన మనసుకు, శరీరానికి ఒక దివ్యౌషధంగా పనిచేస్తుంది. ఇది ఊహాతీతమైన అమృతం. నిద్ర మానసిక పరిపుష్టికే గాక శారీరక అందాన్ని కూడా పెంచుతుంది. అది ఎలాగో చూద్దాం.

- సి.వి.సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

పైన చెప్పుకున్న కొద్దిమందిలానే నెపోలియన్ కూడా ఆలోచించాడు. తానొక అతీతవ్యక్తినని, అతీత శక్తులు తన సొంతమని భావించాడు. ఏ పనైనా తాను సాధించి తీరగలననే నమ్మాడు. ఆత్మవిశ్వాసం చాలా అవసరమన్నాడు. రోజులోని 24 గంటల్లో మనిషి 4 గంటలు నిద్రపోతే విశ్రాంతి సరిపోతుందన్నాడు. పైగా తాను ఆ విధంగానే నిద్రపోతున్నట్లు చెప్పాడు.

తన గురించి తాను అధికంగా ఊహించుకుని ప్రకృతి సూత్రాలు ఖాతరు చేయని కారణంగానే నెపోలియన్ నాశనమయ్యాడు. నెపోలియన్ యుద్ధానికి వెళ్లినప్పుడు యుద్ధం చేస్తూ మధ్యమధ్యలో నిద్ర పోయేవాడని చెప్పుకునేవారు. ఇలా మధ్యలో నిద్ర రావడానికి కారణం తనలోని వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడమేనని అతను భావించాడట.

శరీర దారుఢ్యం గలవారు తాము ఏ పనైనా చేయగలమనే ధీమాతో ఉంటారు. ఆత్మవిశ్వాసం అధికంగా ఉంటుంది. ఇలాంటివారు శారీరక దారుఢ్యం తక్కువగా గల వారికంటే ముందుగానే లొంగిపోతారు. కారణం ఏంటంటే బలహీనంగా వుండేవారు తమ శక్తి మేర పనిచేసి విశ్రాంతి తీసుకుంటారు. అందువల్ల వారు త్వరగా అలసిపోరు.

ఇంచుమించు మనమందరం పగలు కష్టపడి పనిచేసి సాయంత్రానికి అలసిపోతాం. రాత్రి హాయిగా నిద్రించి ఉదయం లేచేసరికి ఫ్రెష్‌గా తయారవుతాం.

నిద్ర గొప్పదనం

పగటిపూట శ్రమించే సమయంలో శరీరంలో ఉత్పత్తి అయిన విషాలన్నీ రాత్రి నిద్రలో తొలగిపోతాయి. శరీరంలో మిలియన్ల సంఖ్యలో కణాలు పునఃనిర్మితమవుతాయి. ఈ అద్భుత ప్రభావం వల్లే మనకు తాజాగా అనిపిస్తుంది.

జీవితంలో ఇంత విలువైన నిద్రాసమయాన్ని వృధా అవుతున్న సమయంగా భావించడం అమాయకత్వం అనిపించుకుంటుంది. ఇలాంటి వ్యక్తులు ఇతరులు నిద్రించే సమయంలో పని చేసి లాభాలు సంపాదిస్తున్నామనుకుంటారు.

ఇలా చేయడం వల్ల ఇతరులకన్నా మిన్నగా సాధించలేరు. ఇతరులంటే విశ్రాంతి, ఆటవిడుపులతో పనిచేసేవారు. నిద్రలేమి మెదడు, నరాలకు సంబంధించిన కొత్త సమస్యలను తెచ్చిపెడుతుంది. మనిషిని అశాంతికి గురిచేస్తుంది. ఆ తర్వాత పిచ్చిపిచ్చిగా మార్చి చివరకు ఆత్మహత్యకు కూడా ప్రేరేపిస్తుంది.

నిద్రలేమి

చైనాలో పూర్వకాలం తప్పుచేసిన వారికి శిక్ష నిద్ర పోకుండా చేయడమట. 14 లేదా 15 రోజుల్లో ఆ దోషి నిద్రలేమి కారణంగా పిచ్చివానిగా మారి మరణించేవాడట.

మనిషిని అత్యంత దారుణంగా హింసించడం అంటే నిద్ర లేకుండా చేయడం. ముసలివారు అధిక రక్తపోటు కారణంగా రక్త నాళాల గోడల్లో మార్పు సంభవించి నిద్ర లేమికి గురవుతుంటారు. స్థితి స్థాపక ధర్మం గల రక్తనాళాలు గట్టి పడతాయి. ఫలితంగా అధికంగా ఉన్న రక్తాన్ని సులువుగా సరఫరా చేయలేకపోవడం వల్ల రక్తం చురుకుదనం పెరిగి నిద్ర లేకుండా, రాకుండా చేస్తుంది.

అర్థరహితమైన ఆలోచనలతో మనిషి నిద్రరాక సతమతమవుతూ ఉంటాడు. ఈ రకమైన ఆలోచనలు రాకుండా మనిషి తనను తాను సంరక్షించుకోవాలి.

ఉన్నతోద్యోగుల విషయంలో...

మంచిపేరు తెచ్చుకున్న పలువురు అధికారులకు నిద్ర ఒక పెద్ద సమస్యగా తయారవుతుంది. వీరు తీసుకునే నిర్ణయాలు, పనిలో ఒత్తిడి, ఆందోళన మిశ్రమమై ఉంటాయి. అందుకే వీరు నిద్ర సమయంలో కూడా సమస్యలకు పరిష్కారమార్గాలు అన్వేషిస్తూ నిద్రకు దూరమవుతుంటారు.

పగలంతా కష్టించి పనిచేసిన తర్వాత మెదడు చురుగ్గా, ఆరోగ్యంగా ఉండక విశ్రాంతి కోరుకుంటుందని వారికి తెలీదు. ఆఫీసు వదిలినా వారి మెదడు ఆలోచించడం మానదు. అధికారులే కాదు, బాధ్యతాయుతమైన కీలకస్థాయిల్లో ఉన్న వారికీ ఇవే సమస్యలు.

మనకు కావాలనుకున్నప్పుడు, అవసరం అనుకున్నప్పుడు రిలాక్స్ కాగల్గడం నేర్చుకోవాలి. ఇటువంటి ఆటవిడుపు కార్యక్రమాల వల్ల ఎన్నో సమస్యలకు పరిష్కారమార్గాలు దొరుకుతాయి.

సర్ విన్‌స్టన్ చర్చిల్ రెండవ ప్రపంచయుద్ధ సమయంలో రోజుకు రెండు లేదా మూడు గంటలు మాత్రమే నిద్రపోయేవాడు. అతడు సమర్థవంతంగా పాలించగల్గడానికి కారణం సమయం దొరికినప్పుడల్లా చిన్న చిన్న కునుకులు తీయడమే.

బ్రిటన్ ప్రధానమంత్రి గ్లాడ్ స్టోన్ లండన్ వదిలితే రాజకీయ ఆలోచనలు మనసులోకి రానిచ్చేవాడు కాదు. వృత్తిపరమైన ఆందోళనలవల్ల ఎన్నడూ అతనికి ఐదునిమిషాలు కూడా నిద్రపట్టక బాధపడలేదని ప్రకటించాడు.

వ్యాపారపరమైన, వృత్తిపరమైన సమస్యలు మనసును తొలిచేస్తుంటే లేదా అసూయాద్వేషాల వంటివి మనసును వేధిస్తుంటే మంచి పుస్తకాలను నేస్తాలుగా వాడుకోవచ్చు.

పుస్తకం చదవడం గొప్ప రిలాక్సేషన్‌గా ఉంటుంది. అది మెదడుకు ప్రశాంతత, నిశ్శబ్దతా ప్రసాదిస్తుంది. అలాగే కొందరు మహిళలు తమ అందాన్ని కాపాడుకునేందుకు అనేక రకాలుగా మేకప్ చేసుకుంటారు. వారు తగిన విధంగా నిద్రపోలేరు. మనసు ప్రశాంతంగా ఉంటే అందం దానంతట అదే పెరుగుతుందని తెలుసుకోవాలి. ★

బాపూకు వినతి

ఓ మహాత్మా! అమృతమూర్తీ!
నీ మహనీయమైన ధీశక్తి లోకోత్తరము
అది మానవజాతికి మంగళదాయక
మగు మహత్తర నైతిక స్ఫూర్తి
నేటి మా నాయకులు
నీ నుండి పొందిన స్ఫూర్తి
చూచితివా? ఎంత
చోద్యముగానున్నదో
నీ అనుయాయులమని చెప్పకుంటూ
నీతి పాఠాలు వల్లిస్తూ
నిబద్ధతతో ఎంత
నిష్ఠగా ప్రజాసేవ చేస్తున్నారో!
నీవు తెచ్చిన స్వరాజ్యము
నీవు కలలుగన్న రామరాజ్యం
స్వార్థ రాజకీయ
సార్వభౌములకు వీరభోజ్యం
శాంతి, అహింస, సత్యం
స్వార్థ రాహిత్యం
సమతా, మమతా
సౌభ్రాతృత్వం సందేశించి
సౌభాగ్యంతో చల్లగ వర్ధిల్లమని మము
దీవించి, వెళ్లిపోయావు. హాయిగ
జీవించగ మేము ఎల్లరము
కానీ,
స్వార్థం పెచ్చుపెరిగిపోయి
స్వాతిశయం వెర్రితలలు వేస్తూ
స్వతంత్ర భారతదేశం
విచిత్ర భారతదేశమైనది
చెట్టుపేరు చెప్పకుని
కాయలమ్ముకుని
మహరాజులా దర్జాగా
బతికేస్తున్నారు
దొంగనాయాళ్లు
రంగులు మార్చే ఊసరవెల్లులు
ఎన్నాళ్లీ నాటకాలు, బూటకాలు?
ఇంకెన్నాళ్లో ఈ దొంగాటలు!
సామాన్య, పేదా, సాదా ప్రజలనే గాక,
స్వార్థ రహితులు, సత్య సంధులు
సర్వజన శ్రేయోభిలాషులైన
సాధుసత్తములగు దేశభక్తులను
సైతం సరకు గొనక, సాగిస్తున్నారు తమ
స్వార్థ పూరిత దురహంకారమును
పేదల బ్రతుకులు
విషాదగాథలు
ఎన్నాళ్లైనా ఇంతే
ఇక ఇంతే ఈ తంతే, ఈ వింతే
ఆ స్వాతంత్ర్యం
ఈ ప్రజాస్వామ్యం
ఎవరికోసం?
ఎందుకోసం?
నీవు కలలుగన్న రామరాజ్యం
ఇంతే సంగతులు
ఓ మహాత్మా! ఓ మహర్షీ!
ఈ పుణ్య స్వతంత్ర భారతావనిలో
ఈ మహాప్రజాస్వామ్య వ్యవస్థలో
ఏదీ సత్యం? ఎక్కడ న్యాయం?
ఏదీ ధర్మం? ఎక్కడ త్యాగం?
అంతా స్వార్థం, స్వాతిశం
అంతులేని మాయాజాలం!
ఓ మహాత్మా!
"నీ మహోన్నత వ్యక్తిత్వం"
మానవాళి మంగళప్రద మనుగడకు
మార్గదర్శకమైన "దివ్వవెలుగు"

- ఎస్.ఎన్.రెడ్డి

కవిత్వమ్

శతకం మారింది

చినుకులు బంద్ ప్రకటించాక
ఏరువాక సాగి ఆగిపోయింది
బోరు బావి దత్తత ఫలించి
పొలంతల్లి నీళ్లు పోసుకుంది
ఖరీఫ్ పంటకు చేసిన అప్పులు
మోయలేక బలి చక్రవర్తినై
భూమిలోకి కూరుకుపోతుంటే
రబీపంట యూరియా తెమ్మంటుంది
ఊళ్లో ఉత్తరం దక్షిణం
తూర్పు పడమరలు ప్రదక్షిణించినా
అప్పిచ్చువాడు కానరాడు సుమతీ-

ఊపిరితిత్తులు గుండె
గర్భకోశం కాలేయం వ్యాధులు
మూల శంఖిల్ని నేను మాట్లాడంలేదు
వొట్టిపోయిన పూరును
కబేళాకు తరలించిన డాక్టరు
పట్టణం పొదుగు పిండుతున్నాడు

తలనొప్పి జలుబుకూ వైద్యుడు
ఊళ్లో కరువయ్యాడు సుమతీ-
అడుగంటిన ఊరబావిలో
చేద గొంతెండి దుఃఖిస్తుంటే
కాంతల కన్నీటితో బావి
అధరాలు తడుపుకుంటూ ఉంది
వర్ష రుతువులోనూ ఇసుక
ఏటిని కుంపటి చేస్తుంది
ఎడతెగక పారే ఏరు మాటెలా ఉన్నా
ఏ రుతువులోనూ ఏరు
తలంటు స్నానం చెయ్యదు సుమతీ-

తిథి నక్షత్రాల మాటెలా ఉన్నా
రాహుకాలం అమృత ఘడియల ఊసెత్తకున్నా
గృహ ప్రారంభానికి
వివాహ ముహూర్తానికి
పురోహితుడు దొరకడు
అతడి ఉదరం నగరాన్ని నమ్ముకుంది
ఊళ్లో ఒక్క ద్విజుడూ లేడు సుమతీ-

ఏ ఊళ్లో నివాసం ఎన్నుకున్నా
ఏదో ఒకటి తరుగై పద్యాన్ని పూరించదు!

- అడిగోపుల వెంటకరత్నం

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

కూపన్ పంపండి లేదా SMS పంపండి.

CHENNAI: 0-97890 99589

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరిపేరు, ఫోన్ నెం., పిన్‌కోడ్‌లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. మా సెల్‌ఫోన్ 24 గంటలూ కంప్యూటర్‌కు లింక్ చేయబడి ఉంటుంది. మీ అడ్రసు ఆటోమేటిక్‌గా కంప్యూటర్ రిసీవ్ చేసుకుంటుందని తెలుసుకోగలరు. కోర్సు ఫీజు రూ.1000/-లు. ఇది 5 నెలల కోర్సు. రోజూ ఒక గంట చదివితే చాలు. ఈ కోర్సులో 10 పుస్తకాలు, 1 CD ఉంటాయి. మీకు ఏమయినా సందేహాలు ఉంటే, లెటరు వ్రాసి తెలుసుకోవచ్చు. 10 రోజులలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి కోర్సు మెటీరియల్ పొందవచ్చును. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్సు వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: □□□□□□

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**93915 49930. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

కథ

బడ్జెట్

ఆర్థిక మంత్రి సిన్హా ఇస్తున్న 2000 సంవత్సరం బడ్జెట్ తాలూకు ఉపన్యాసం టీవీలో చూస్తున్నాడు అతీవ్. చానల్ మార్చాడు. స్టార్ న్యూస్‌లో కూడా బడ్జెట్ గురించే వస్తోంది. స్పోర్ట్స్ చానల్‌కి మార్చాడు. క్రికెట్‌లో ఆస్ట్రేలియా భారత జట్టుని చావబాది వదిలిపెడుతోంది! ఇక మన ఆటగాళ్లతో మ్యాచ్ ఫిక్సింగ్ రోజులు అయిపోయాయని అనుకున్నాడు అతీవ్.

యాష్ ట్రేలో సిగరెట్ ఆర్పి పడేస్తూ ఆర్థిక మంత్రి మీద విసుగు ప్రకటించాడు అతీవ్. దొంగవెధవ... బీడీ, సిగరెట్ల మీద టాక్సు పెంచుతాడు. కానీ స్కూటర్లూ, కార్లూ చవగ్గా దొరికేటట్లు బడ్జెట్ తయారు చేస్తాడు. అంటే కార్లూ స్కూటర్ల మీద సరదాగా తిరగండి... పెట్రోల్ తగలబెట్టండి... అనేగా వీడు చెప్పేది? కోక్ చవక. పిల్లలకి చిన్నప్పట్నుండే చేదు పానీయం అలవాటు చేస్తే ఏదో ఒకరోజు తాగడం మొదలు పెడతారుగా? సరదాలకి టాక్స్ తక్కువ, అవసరమైన వస్తువుల మీదే టాక్స్... పేదోళ్లు బీడీ కొనుక్కోవాలన్నా వీల్లేని పరిస్థితి! సిన్హా సిగరెట్ తాగడు. అతనికి ముందు ఆర్థిక మంత్రిగా పనిచేసినాయన కూడా పొగ తాగడు... మరి ఆయన సర్దార్జీ మన్‌మోహన్ సింగ్ కద!? ఇది కాక చాలా మంది నాయకులకు వ్యవసాయమనే ముసుగు ఉంది. పై సంపాదనంతా వ్యవసాయంలో వచ్చిన సంపాదన కింద గప్‌చుప్‌గా కలిపేసుకుంటారు.

అతీవ్ బెంగాలీ బాబు. అతనికి కాబోయే భార్య అణిమ ఉత్తరప్రదేశ్‌కి చెందిన స్త్రీ. ఆమె సాంగత్యంలో తను అన్నీ హిందీలోనే ఆలోచిస్తున్నానని, మాట్లాడుతున్నానని హఠాత్తుగా అనిపించింది. ఇప్పుడు కూడా అతని ఆలోచనలు హిందీలోనే సాగుతున్నాయి!

కుర్తా తొడుక్కుని గదిలోంచి బైటికి రాగానే వదిన మొహంలో వంకర నవ్వు కనబడింది. ఆమె ఏదో అనే లోపలే వీధిగుమ్మం తెరుచుకుని బైటికొచ్చేశాడు. కిళ్లీ కొట్లో సిగరెట్ కొంటుంటే షాపతను ధర పెరిగిందన్నాడు. అతనికి అప్పుడే బడ్జెట్ గురించి తెలిసిపోయింది. కొంత దూరం నడిచి ఇంకో కొట్లో ఫ్రూటీ కొన్నాడు. ఆ దుకాణం ఓనరుకు బడ్జెట్ గురించి తెలిసినట్లు లేదు. ధర తగ్గించలేదు.

అతీవ్ గడియారం వైపు చూశాడు. ఒకటింబావు. అణిమ క్లాసు మూడు గంటలకి గానీ అవదు. అతను బస్సెక్కి రెండు గంటలకల్లా చౌరంగీ చేరుకున్నాడు. ఫుట్‌పాత్ మీద నడుస్తూ కాసేపు విండో షాపింగ్ చేశాడు. లైట్ల వెలుగులో ప్రతి వస్తువూ ఉన్నదాని కన్నా అందంగా కనిపిస్తోంది. ప్రతి దుకాణంలోనూ సేల్ బోర్డులు వేలాడుతున్నాయి. ఎన్నో అధునాతనమైన వస్తువులు తక్కువ ధరకి అమ్ముడుపోయేందుకు ఆత్ర పడుతున్నాయి.

అతీవ్‌కి దిగులనిపించింది. గుమస్తా పని చేసే అతని మనసు రకరకాల ఆలోచనల్లో చిక్కుకుపోయింది. కొన్ని లక్షల కేసులు కోర్టుల్లో దశాబ్దాల నుండి దేకుతున్నాయి. జడ్జిల సంఖ్య వందో రెండు వందలో పెంచితే ప్రభుత్వానికి పెద్ద నష్టమేమీ ఉండదు. వాహనాల మీద డ్యూటీ తగ్గించకపోయి ఉంటే కొన్ని వేల మందికి ఈ ఇబ్బందులు తప్పేవి. సాఫ్ట్ డ్రింకుల మీద టాక్స్ తగ్గించే బదులు మందుల ధర తగ్గిస్తే రోగులు కోలుకుని పనిలోకి వెళ్తారు. అణిమ ఎప్పుడూ అంటుంది 'నీకు ఫైల్స్ తప్ప మరేదీ అర్థం కాదు. గ్లోబలైజేషన్ అనేది కొండచిలువ లాంటిది. అది ఊపిరి వదిలితే చుట్టుపక్కల ఉన్నవన్నీ దాని విషప్రభావానికి గురవుతాయి. ఇక ఊపిరి పీల్చిందంటే దగ్గర్లో ఉన్నవన్నీ దాని పొట్టలోకే చేరిపోతాయి' అని.

ఆర్థికశాస్త్రం బోధించేందుకు మహిళా లెక్చరర్లు తక్కువగా ఉండడంతో దళితురాలు అణిమకి కాలేజీలో ఉద్యోగం వచ్చింది. కానీ అతీవ్ ఆమెని పెళ్లి చేసుకోవాలనుకుంటే అతని తల్లిదండ్రులు ఇంట్లోనుండి వెళ్లగొడతామన్నారు. అంతేకాదు, మర్యాదస్తులుండే కాలనీలో అద్దెకి ఇల్లు కూడా దొరకలేదు.

హేంగర్లు అమ్మే కుర్రాడు వచ్చి అతీవ్ ఆలోచనలకి భంగం కలిగించాడు. అతను మళ్లీ గడియారం కేసి చూశాడు. ఇంకా రెండున్నరే అయింది. అణిమ రెస్టారెంట్‌కి చేరుకునేసరికి మూడుంబావు అవుతుంది. పేవ్‌మెంట్ మీద వార్తాపత్రికలమ్మే కుర్రాడి దగ్గర అతీవ్ ఈవినింగ్ న్యూస్ కొన్నాడు. అప్పుడే ఆర్థిక మంత్రి ఉపన్యాసం వార్తల్లోకి ఎక్కింది. వార్తాపత్రికలు ఎంత వేగంగా పని చేస్తున్నాయో! అనుకున్నాడు. మార్కెట్‌వాద ప్రభావం మరి! కానీ ఎకనమిక్స్ లెక్చరర్ అణిమ మార్కెట్ కొన్ని షరతుల సాయంతో పని చేస్తుంటుంది. అది ఏ దేశంలోనైనా సరే ప్రభుత్వం అదుపాజ్ఞల్లో ఉండదట... సరిగ్గా పెట్టుబడిదారీ విధానం లాగే. ఒక పక్క అది గుళ్లూ గోపురాలూ కట్టిస్తుంది. మరోపక్క మద్యం ఫ్యాక్టరీలని, కాంట్రాక్టులనీ నిర్వహిస్తుంది. అయినా ఈ ఆడవాళ్లకి మద్యం అంటే అంత రోత ఎందుకో? కాస్త వాసన తగిలితే చాలు, విడాకుల దాకా వెళ్లిపోతారు! కానీ ప్రభుత్వం తాలూకు ఆర్థిక వ్యూహం మొత్తం లిక్కర్ – ఎక్సైజ్ మీదే ఆధారపడి నడుస్తోందాయె!

అతీవ్ వెనక్కి తిరిగి రెస్టారెంట్ వైపు నడక సాగించాడు. అక్కడ కూర్చుని తాపీగా వార్తా పత్రిక చదువుకుందామనుకున్నాడు. ఇంతలో అణిమ వేగంగా నడుచుకుంటూ రావడం కనిపించింది. 'అప్పుడే ఎలా వచ్చేసింది?' అనుకున్నాడు కొంచెం ఆశ్చర్యపోతూ.

"పావుగంట ముందే ఊడిపడ్డావే?" అన్నాడు.

"ఏమిటా భాష? సరిగ్గా మాట్లాడడం చేతకాదా?" అంది చిరుకోపం ప్రదర్శిస్తూ.

"అది కాదు. ఇంత త్వరగా ఎలా వచ్చావు?"

"అది నీకు చెప్పినా అర్థం కాదులే. కేంద్ర ప్రభుత్వం భారతీయత ప్రదర్శిస్తోంది! సాయంత్రం ఐదు గంటలకి బడ్జెట్ ఏంటో చెప్పడం బ్రిటీష్ వాళ్ల పద్ధతి. ఇప్పుడు జ్యోతిష్యుణ్ని పిలిపించి, ఉదయం పదకొండు గంటలకి మంచి ముహూర్తం నిర్ణయించారు. అందుకని ఇన్‌కంటాక్స్ సమస్యల్లో మునిగిన సగం మంది లెక్చరర్లు చెక్కేశారు. మూడొంతుల మంది స్టూడెంట్స్ రానేలేదు! ఒక్కోక్లాసులో నలుగురైదుగురి కన్నా లేరు. మిగతావాళ్లేరని అడిగితే 'ఇవాళ బడ్జెట్ ఉంది కదా మేడమ్!' అన్నారు. ఒకమ్మాయిని మరి నువ్వు మాత్రం ఎందుకొచ్చావని అడిగితే 'ఈ రోజు నాన్న ఇంటిదగ్గరే ఉన్నాడు. ఆయన ఇంట్లో ఉంటే అమ్మతో ఎప్పుడూ వాదిస్తూనో, పోట్లాడుతూనో ఉంటాడు. ఇక్కడైతే ప్రశాంతంగా ఉండొచ్చని వచ్చా. సాయంత్రాలు ఎలాగూ తప్పదు!' అంది విచారంగా. అసలు ఇవాళ నిన్ను కలిసేందుకు రాకూడదనే అనుకున్నాను. కానీ ఫోన్ చేస్తే మీ అమ్మ ఎత్తుతుంది. నా గొంతు వింటేనే ఆవిడ మళ్లీ స్నానం చెయ్యాల్సి వస్తుందని మానేశాను! మాట ఇచ్చి రాకపోతే నీకు కోపం వస్తుందాయె. అసలు ఇప్పుడే నీకు విసుగు మొహం పడింది" అంది.



"అది టీ తాగగానే మామూలైపోతుందిలే రాణిగారూ!"

"రాణి గారేమిటి? అంట్లు తోముకునేది అను. రోడ్లూడ్చేది అను. మా ముత్తవ్వ ఎస్ప్లెనేడ్‌లో రోడ్లూడ్చే పని చేసేదట. మా తాత బిల్డింగ్ మెటీరియల్ అమ్మేవాడు. గాంధీ టోపీలతో ఎన్నో పరిచయాలుండేవి. మా నాన్న ఎమ్.ఎ చేసి సేనిటరీ

ఫిట్టింగ్స్ అమ్మే వ్యాపారంలో బాగా సంపాదించాడు. పెద్ద మేడ కట్టుకున్నా ఉండేది మాత్రం మా కులంవాళ్లుండే పేటలోనే!"

"సరే. చరిత్ర పాఠాలు చెప్పడం అయిపోతే లోపలికెళ్లి కూర్చుందామా మేడమ్?"

లోపల కూర్చున్నాక అణిమ ఆర్డరిచ్చింది. "రెండు ప్లేట్లు ప్యాటీస్, ఒక కోక్, ఒక టీ"

"నీకు కోక్, నాకు మాత్రం టీ ఎందుకు చెప్పావ్?"

"ఎండాకాలం టీ చల్లబరుస్తుంది. పైగా నీకు అదే పడుతుంది"

"కోక్ ధర తగ్గింది!"

"ఏప్రిల్ ఫస్ట్ నుండి వస్తువుల ధరలు పెంచదలచుకుంటే వాటిని బడ్జెట్‌కి ముందే పెంచేస్తారు. కానీ తగ్గేవి మాత్రం ఫూల్స్ డే నుండే తగ్గుతాయి"

"నాతో సహవాసం చేసి నువ్వు బాగా తెలివితేటల్ని సంపాదించుకున్నావు!"

"పిచ్చి వాగుడు మాని, త్వరగా తిను. తారకేశ్వర్‌లో 'తాజ్ మహల్ చూడాలి"

"భాష గురించి నాకు చెప్పావు. మరి నీ భాష ఎలా ఉంది?"

అణిమ నవ్వేసింది. ఇద్దరూ లేచి బైటికొచ్చారు.

"తారకేశ్వర్‌లో ఆ ఇల్లెక్కడుంది?" అంది అణిమ.

"ముందు మనం మా ఆఫీస్ ప్యూన్ అసీమ్ మండల్ ఇంటికెళ్లాలి. అతనే చెప్తాడు"

తారకేశ్వర్ చేరుకుని ఒక ఇంటి ముందాగి అతీవ్ బెల్ కొట్టాడు. ఒక మధ్యవయస్కురాలు తలుపు తెరిచింది. ఆవిడే అసీమ్ భార్య అనుకుని అణిమ నమస్కారం చేసింది. అతీవ్ చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

"ఇదేదో ప్యూను ఇల్లులాగ లేదు. ధనికుల మేడ లాగుంది!" అంది అణిమ.

ఆమె వాళ్లని లోపలికి రమ్మని ఆహ్వానించింది. లోపల ఒక పెద్ద గదిలో అసీమ్ పడుకుని ఉన్నాడు. అతీవ్‌ని చూడగానే హడావుడి పడుతూ లేచి నిలబడ్డాడు. "మీరా సార్! ఈవిడ.. అణిమ గారు కదూ? అర్థమైంది సార్! " అన్నాడు.

ఇద్దర్నీ కూర్చోమని చెప్పి భార్యని కేకేశాడు. "అరె, మధుమాలతీ! ఆఫీసులో పనిచేసే సారు వచ్చారు. స్వీట్లు అవీ పంపించు!" జ్వరం తగిలి ఆఫీసుకు రాలేదని అతీవ్‌కి చెప్పాడు.

ఒక ప్యూను ఇంత గొప్ప హోదాలో బతకడం చూసి నోరెళ్లబెట్టింది అణిమ. అప్పుడే పని మనిషి చేతిలో రసగుల్లాల ట్రేతో బాటు మధుమాలతి అక్కడికి వచ్చింది. ఆమెని చూసి అణిమ అవాక్కయింది. "ఎంత అందంగా ఉంది!" అనుకుంది.

అతీవ్ ఇంటి విషయం అసీమ్‌ని అడిగాడు. "స్టేషన్ నుండి కుడివైపుకి వెళ్తే ఐదో ఇల్లో, ఆరో ఇల్లో సార్. మొదటి అంతస్తులో రెండు గదులు, వంటిల్లు, డాబా. అద్దె పన్నెండొందలు. కరెంటు బిల్లు మీరే



కట్టుకోవాలి" అన్నాడు అసీమ్.

"చూద్దం వీలవుతుందా?"

"అదే ముఖ్యం కద సార్. నచ్చితేనే అడ్వాన్స్ ఇచ్చేది?"

"మళ్లీ కులం ప్రసక్తి రాదు కదా? నువ్వు ముందుగా చెప్పావా?"

"మీరు మాత్రం ఎందుకు చెప్పడం? మీ కులమే అణిమ గారిది!"

"లేదు భాయ్. నాకు దాచిపెట్టడం ఇష్టంలేదు!" అంది అణిమ.

"అవన్నీ వదిలేయండి మేడం! ముఖర్జీ ఇవాళ పెద్ద సేఠ్‌గా చెలామణి అవుతున్నాడు. కానీ అతని చరిత్ర నాకు బాగా తెలుసు. దొంగ వ్యాపారం చేసి నాలుగేళ్లు లోపల కూడా ఉండి శిక్ష అనుభవించి వచ్చాడు. కొడుకు తన కుటుంబంతో స్టేట్స్‌కి వెళ్లాడు. ఇప్పుడు అద్దెకివ్వాలని చూస్తున్నాడు. ఎందుకంటే అతనికి గుండె జబ్బు. నేను కూడా దళితుణ్ణే. కానీ నా ముందు ఎంతమంది డబ్బున్న ఆసాములు చేతులు కట్టుకుని నిలబడతారో తెలుసా? ఆ తర్వాత హుగ్లీలో మూడు సార్లు మునుగుతారనేది వేరే విషయం. నా చేత శివలింగానికి అభిషేకం చేయించేందుకు తారకేశ్వర్ పూజారుల్లో గొప్ప పోటీ ఉంటుంది ఏమనుకుంటున్నారో! ఎందుకంటే పూజ చేయించినందుకు కొత్త వంద రూపాయల నోటు ఇస్తాను" అన్నాడు అసీమ్.

ఇద్దరూ అక్కడ్నుండి బైట పడ్డారు. ముఖర్జీ ఇల్లు వెతుక్కుంటూ బయల్దేరారు.

ముఖర్జీ మోశాయ్ ఇల్లు బైటినుండి చూడ్డానికి చాలా బాగుంది. ముఖర్జీ తలుపు తెరిచి ఇద్దర్నీ లోపలికి రమ్మన్నాడు. "ఒక సంగతి ముందే చెప్తే మంచిదనుకుంటాను, ముఖర్జీగారూ! అది విన్న తర్వాత లోపలికి రమ్మంటే వస్తాం" అన్నాడు అతీవ్.

"చెప్పండి!" అన్నాడు ముఖర్జీ కొంచెం ఆశ్చర్యపోతూ.

"నా పేరు అతీవ్ బోస్. ఈమె అణిమ... బీహారీ హరిజనురాలు. మేమిద్దరం త్వరలో పెళ్లి చేసుకుందామనుకుంటున్నాం. అందుకే అద్దెకి ఇల్లు కావాలి. మరి మీరు మాకు ఇల్లు అద్దెకిస్తారా?"

ముఖర్జీ మొహం అసహ్యంగా పెట్టాడు. అతని మొహం అడవిపంది మొహంలా క్రూరంగా మారిపోయింది. "అసీమ్ మీరు బోసులని చెప్పాడే మరి?" అంటూ పక్కనే ఉన్న పెళ్లాం వైపు చూశాడు. హరిజన్ అన్న మాట విన్నప్పుడే ఆవిడ మొహం తిప్పేసింది!

ఇద్దరూ స్టేషన్‌కెళ్లి హౌరా వెళ్లే రైలు ఎక్కారు. "ప్యూన్ పని చేసుకునే అసీమ్ ఎంత వైభవంగా బతుకుతున్నాడు!" అంది అణిమ. ఆమె మొహంలో ఇల్లు దొరకలేదన్న బాధ ఏమాత్రం కనిపించలేదు. అన్ని చోట్లా 'నో' అనే మాట వినడం అలవాటైపోయిందామెకి.

"అవును. మొదట్లో రైడ్స్ చేసే ఆఫీసర్ల వెంట ఉండేవాడు. కానీ ఆ సేఠ్‌కీ, కాంట్రాక్టర్లకీ అసీమ్ ముందుగా హెచ్చరిక చేసేవాడు. దానికి బదులుగా నోట్ల కట్టలు సంపాదించుకునేవాడు. తర్వాత తన వడ్డీ వ్యాపారం మొదలు పెట్టాడు. ఇతని దగ్గర పెద్ద పెద్ద కంపెనీలు షార్ట్ టర్మ్ అప్పులు తీసుకుంటాయి.

"మరి అతని సంపాదన మీద రైడ్స్ జరగవా? మీ ఇన్ కమ్ టాక్స్ పనితీరు ఇదేనా?"

"అరే. ఎవరైనా కంప్లైంట్ చేస్తే కదా? కమిషనర్ దగ్గర్నుండి అందరూ ఇతనికి రుణపడి ఉంటారాయె!" అన్నాడు అతీవ్.

స్టేషన్ నుండి బైటికొచ్చి టాక్సీ ఎక్కడానికి బదులు ఇద్దరూ స్టీమర్ ఎక్కారు. ఇద్దరి మొహాల్లోనూ దిగులన్నది లేదు... ఇల్లు దొరకదని వాళ్లకి ముందే తెలుసు! స్టీమర్‌లో గోలగోలగా ఉంది. అందరూ బడ్జెట్ గురించే మాట్లాడుకుంటున్నారు. అతీవ్ పేపర్ చదువుదామని తీశాడు.

"కాస్త వార్తలు చూసి చెప్పు అతీవ్! ఆర్థికమంత్రి దళితులకి టాక్స్ లేదని ఎక్కడైనా ప్రకటించాడేమో?" అంది అణిమ వెటకారంగా.

"అలా ఎందుకు ప్రకటిస్తాడు?" అన్నాడు అతీవ్ నవ్వుతూ.

"పాపులర్ అయ్యేందుకు! ఒక్క యూపీ ఏమిటి? బెంగాల్‌లో కూడా అప్పుడు బీజేపీ వచ్చేస్తుంది!"

"కానీ అప్పుడు కూడా మన ఇంటి సమస్య అలాగే ఉంటుంది కదా?" అన్నాడు అతీవ్ భుజాలు ఎగరేస్తూ.

అణిమ నవ్వి "ఇంద్రుడి వజ్రఘాతానికి భయపడి నన్ను మీ స్వర్గంలోకి తీసుకెళ్లలేకపోతే, మరో మార్గం ఉంది. నువ్వే మా లోకంలోకి రా. మా లోకం నిన్ను తరిమి కొట్టదు. స్వాగతం పలుకుతుంది!" అంది.

అతీవ్ ఆలోచనలో పడ్డాడు. మరుక్షణం తలాడిస్తూ "రియల్లీ. యూ ఆర్ ఇన్‌టెలిజెంట్!" అన్నాడు.

అణిమా, అతీవ్‌కి సంబంధించినంత వరకూ పొద్దున ప్రకటించిన బడ్జెట్‌కి అర్థం లేకుండా పోయింది. బడ్జెట్ అనుమతించినా... పెద్ద మనుషులుండే కాలనీల్లో వాళ్లకి ఇల్లు దొరకడం అసంభవమని తేలిపోయింది!

హిందీమూలం : **విజయ్**

అనువాదం : **ఆర్.శాంతసుందరి**



'వంద ఎలుకలు తిన్న పిల్లి ... అహింసా మంత్రాన్ని జపిస్తూ హజ్ యాత్రకు వెళ్లింది' (సౌ చూహే ఖాకర్ బిల్లీ హజ్‌కు నిక్లీ) అని ఉర్దూలో ఒక సామెత. 2002 గోద్రా రైలు దురంతం అనంతరం జరిగిన సామూహిక మారణకాండపై గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల చేపట్టిన మూడు రోజుల సద్భావనా దీక్ష పైసామెతను నిజం చేస్తోంది. మోడీ దర్శకత్వంలో ఆయన మంత్రివర్గ సహచరులంతా దగ్గరుండి జరిపించిన ఈ సామూహిక ఊచకోతలో దాదాపు రెండు వేల మంది మృతి చెందారు. ముస్లింలను వెతికి వెంటాడి హతమార్చిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు దీక్ష పేరుతో మొసలి కన్నీరు కారుస్తోంది. 'శాంతి, ఏకత్వం, సామరస్యం' అనే నినాదాలతో 60 కోట్ల రూపాయల ప్రభుత్వ ఖర్చుతో మోడీ చేపట్టిన ఈ హైటెక్ దీక్ష 2002 గోద్రా అనంతర ఘటనల్లో ఆప్తులను, ఆస్తులను, మానమర్యాదలను కోల్పోయిన బాధితులకు ఊరట కలిగించకపోగా వారి గాయాలపై కారం చల్లినట్లయింది. నాడు గోద్రాలో ఏం జరిగింది? అందులో మోడీ, ఆయన మంత్రివర్గం పాత్ర ఏంటి? దగ్గరదగ్గరగా దశాబ్దం తర్వాత ఇప్పుడీ దీక్ష ఎందుకు? వంటి అంశాలు ఇవాళ్టి కథనంలో...

గాయాలపై కారం చల్లిన మోడీ

2002లో అసలేం జరిగింది... గుజరాత్‌లోని గోద్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలులోని ఎస్-6 అనే బోగీ ఫిబ్రవరి 27, 2002లో అగ్నికి ఆహుతి అయింది. ఈ దుర్ఘటనలో అయోధ్య నుండి వస్తున్న 59 మంది ప్రయాణీకులు (కరసేవకులు) సజీవ దహనమయ్యారు. ఈ ఘటనకు ముస్లింలు కారకులంటూ సంఘ్ పరివార్ శక్తులు గుజరాత్ రాష్ట్రమంతా మతకలహాలు, దమనకాండ, లూటీలకు పాల్పడ్డారు. ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ ప్రోద్బలంతో హిందూ ఉగ్రవాదులు మారణహోమం సృష్టించారు. ముస్లింలను ఊచకోత కోశారు. కనీసం రెండు వేల మందికి పైగా ముస్లింలు ఈ ఘటనలో మృత్యువాతపడ్డారు. లక్షలాది కుటుంబాలు వీధుల పాలయ్యాయి. ఆస్తుల లూటీ, మహిళలపై అత్యాచారాలు అంచనాలకు మించి జరిగాయి. ఆ మారణకాండను అదుపు చేయకూడదని స్థానిక పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. అల్లర్లు పెచ్చరిల్లిన ప్రాంతంలో సైన్యాన్ని దించేందుకు కాషాయ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస అనుమతి ఇవ్వలేదు. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీ ఈ దమనకాండను చోద్యం చూసినట్లు చూశారు. అల్లర్లు జరిగిన ప్రాంతాన్ని సందర్శించేందుకు వామపక్ష పార్టీలతో సహా ప్రతిపక్ష పార్టీలు చేసిన ప్రయత్నాలనూ మోడీ ప్రభుత్వం నిలువరించింది. బాధితులను ఆస్పత్రిలో మాత్రమే సందర్శించే అవకాశాన్నిచ్చింది. మారణకాండ జరిగిన ప్రాంతాల్లో సందర్శించే అవకాశం కల్పించకుండా వాస్తవాలను మరుగున పరిచింది. ధృతరాష్ట్రుడి పాత్ర పోషించిన ప్రధాని వాజ్‌పేయి అంతా అయిన తర్వాత మీరు రాజధర్మాన్ని పాటించలేదని మోడీ తీరును తప్పుబట్టారు. మోడీ ప్రభుత్వం లౌకిక దేశానికి ప్రమాదకారిగా మారిందని ప్రతిపక్షాలు గోల పెట్టిన తర్వాత తూతూ మంత్రం చర్యలు తీసుకున్నట్లు నటించారు. గోద్రా ఘటనను ఆగంతకులు చేయలేదని, ప్రమాదవశాత్తు జరిగిందని దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ యుసి బెనర్జీ నేతృతత్వంలోని 'ఉగ్రవాద నిరోధక కేంద్ర కమిటీ' తేల్చింది. కాగా ఈ దుర్ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు సభ్యులతో ఒక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. 2004లో రైల్వే శాఖ మంత్రిగా లాలూ ప్రసాద్ యాదవ్ నియమితులైన తర్వాత జస్టిస్ యుసి బెనర్జీతో ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారు. గుజరాత్ పోలీసులు గోద్రా దురంతంలో 31 మందిపై కేసు నమోదు చేశారు. వారిలో 11 మందికి మరణ శిక్ష, మరో 20 మందికి జీవిత ఖైదు పడింది. దీన్ని సాకుగా తీసుకున్న కాషాయ మూకలు ఓటరు జాబితా తీసుకొని మరీ ముస్లింల ఇళ్లను వెతికి అగ్నికి ఆహుతి చేశారు. స్థానిక మున్సిపల్ అధికారుల నుండి సమాచారాన్ని సేకరించి ప్రణాళిక ప్రకారం ముస్లింల ఆస్తులను ధ్వంసం చేశారు. నెల రోజుల పాటు జరిగిన దమనకాండ ముస్లింల ప్రాబల్యాన్ని తుదముట్టించాలనే పథకం ప్రకారం జరిగింది.

బెస్ట్ బేకరీ కేసు

మార్చి 1, 2002న వడోదరలో గల బెస్ట్ బేకరీని సంఘ్ పరివార్ దుండగులు అగ్నికి ఆహుతి చేశారు. ఆ దుర్ఘటనలో 14 మంది (అందులో 12 మంది ముస్లింలు) సజీవ దహనమయ్యారు. గుజరాత్ ప్రభుత్వ హత్యాకాండకు ఇది సజీవ దర్పణంగా నిలిచింది. గోద్రా దురంతం తర్వాత చెలరేగిన మతకలహాలు మార్చి ఒకటిన వడోదరకు పాకాయి. హనుమాన్ టేక్రీ ప్రాంతంలో బెస్ట్ బేకరీ అనే చిన్న దుకాణం ఉంది. ఒక గుంపు ఆ బేకరీపై దాడి చేసి బేకరీకి నిప్పు పెట్టింది. ఇతర కేసుల మాదిరిగానే ఆ కేసు దర్యాప్తు చేయడంలోనూ పోలీసులు నిర్లక్ష్యం వహించారు. సాక్ష్యాలు, ఆధారాలు సేకరించలేదు. అనుమానితులను ప్రశ్నించడంలోనూ నిర్లక్ష్యం వహించారు. ఆ కేసుకు సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నప్పటికీ పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని మానవ హక్కుల సంఘం, ఆమ్నెస్టీ తప్పుబట్టాయి. ఈ కేసులో ప్రధాన సాక్షి 19 ఏళ్ల జహీరా షేక్. తమ సంబంధీకులందర్నీ కోల్పోయిన జహీరాకు తీస్తాసెతల్వాద్ అనే సామాజిక కార్యకర్త, జర్నలిస్టు అండగా నిలిచి న్యాయ పోరాటం చేశారు. ఆమెకు గుజరాత్ ప్రభుత్వం అడుగడుగునా ఇబ్బందులు సృష్టించింది. దీంతో కేసు విచారణను ముంబయిలో నిర్వహించాల్సి వచ్చింది. తమ కుటుంబ సభ్యులు సజీవ దహనమవుతుండగా తాను ప్రత్యక్షంగా చూశానని జహీరా సాక్ష్యమిచ్చింది. 'హిందూ మతానికి చెందిన దుండగులు నినాదాలు చేస్తూ బేకరీలోకి దూసుకొచ్చారు. మేమంతా మొదటి అంతస్తులోకి వెళ్లి ఇంటికి తాళం వేసుకున్నాం. సాయంత్రం ఆరు గంటల నుండి మరుసటి రోజు పది గంటల వరకూ ఆ గుంపు మా బేకరీతో సహా

మొసలి కన్నీరు

'గుజరాత్ చెప్పలేనంత బాధలు భరించింది. ఇబ్బందులు పడిన కుటుంబాలకు నా సానుభూతి తెలుపుతున్నాను. ఇప్పటికీ నాకు బాధగా ఉంది.'

మోడీ (దీక్ష సందర్భంగా)

◆◆◆

మూడు రోజుల దీక్షతో 2002 మతకలహాల పాపాలు తొలగిపోవు. మేం ఆ అల్లర్లలో సర్వం కోల్పోయాం. మా ఇంటిని దుండగులు అగ్నికి ఆహుతి చేశారు. ఇంతవరకూ మాకు పరిహారం ఇవ్వలేదు. నా గుర్తింపు పత్రాలన్నీ కాలి బూడిదయ్యాయి. ఎక్కడి నుండి తెచ్చి చూపించాలి- **అమీనా బేగం** - 2002 మత కలహాల బాధితురాలు

(నరోదా పాటియా సమీపంలో గల గుప్తానగర్‌లో అమీనా ఇంటిని హిందూ ఉగ్రవాదులు కాల్చేశారు. ఆమె ఇప్పటికీ అహ్మదాబాద్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ చెత్త డంపింగ్ యార్డ్ సమీపంలోని గుడిసెలో బతుకీడుస్తోంది. ఇంటికి సంబంధించిన కాగితాలూ కాలిపోయాయి. దీంతో తన గుర్తింపును చూపించలేకపోతోంది. దీంతో పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించింది. తన ఇద్దరు పిల్లలను స్కూల్‌లో చేర్పించుకోడానికి స్కూల్స్ అంగీకరించలేదు. దీంతో అఫిడవిట్ దాఖలు చేసి పాఠశాలలో చేర్పించాల్సి వచ్చింది)

◆◆◆

గుజరాత్ ప్రజలకు మోడీ రాసిన బహిరంగ లేఖ ముస్లింలను అవమానించడమే- **తన్వీర్ జాఫ్రీ** - 2002 అల్లర్ల సమయంలో హిందూ ఉగ్రవాదుల చేతిలో దారుణ హత్యకు గురైన మాజీ ఎంపి, కాంగ్రెస్ పార్టీ నేత ఎహసాన్ జాఫ్రీ కుమారుడు.

(ఎహసాన్ జాఫ్రీ భార్య ఇప్పటికీ న్యాయం కోసం పోరాడుతూనే ఉంది. నరేంద్ర మోడీ దీక్ష చేపట్టిన ప్రాంతంలోని ట్రయల్ కోర్టులోనే ఈ కేసు విచారణ జరుగుతోంది)



ఇతర ఇళ్లను అగ్నికి ఆహుతి చేస్తూ కనిపించిన వారినందరినీ ఊచకోత కోశారు.' అని జహీరా సాక్ష్యమిచ్చింది. స్థానిక బిజెపి ఎమ్మెల్యే ఒత్తిడి తేవడంతో పాటు లంచమిచ్చి ఆమె సాక్ష్యాన్ని తారుమారు చేయించిన విషయాన్ని తెహల్కా స్టింగ్ ఆపరేషన్‌లో బయటపెట్టింది. దీంతో సాక్ష్యాన్ని మార్చిన జహీరాకు 50 వేల రూపాయల జరిమానా విధించారు. ఈ కేసులో 21 మందికి యావజ్జీవ జైలు శిక్ష విధించారు. మరో ఎనిమిది మంది ఆచూకీ తెలీలేదని తేల్చారు.

ఎహసాన్ జాఫ్రీ సజీవ దహనం

కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపి, ప్రముఖ కార్మిక నేత ఎహసాన్ జాఫ్రీని కూడా సంఘ్‌పరివార్ శక్తులు ఫిబ్రవరి 28, 2002లో సజీవ దహనం చేశారు. కాషాయ మూకల అరాచకంతో ఇళ్లు కోల్పోయిన బాధిత ముస్లింలు జాఫ్రీ ఇంట్లో తలదాచుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌కు కిలోమీటర్, పోలీసు కమిషనర్ ఆఫీసుకు రెండు కిలోమీటర్ల పరిధిలో గల ఈ ప్రాంతం సురక్షితమైనదని ముస్లింలు భావించారు. విషయాన్ని పసిగట్టిన వేలాది మంది కాషాయ మూకలు ఆ ఇంటిపై కత్తులు, కర్రలు, పైపులు, కిరోసిన్‌తో దాడిచేశారు. తమకు రక్షణ కల్పించాలని, సురక్షిత ప్రాంతానికి తరలించాలని జాఫ్రీతో సహా కాంగ్రెస్ నాయకులు డిజిపికి, పోలీసు కమిషనర్‌కు, మేయర్, ఇతర ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన కరువైంది. అంతకు ముందే ఆ ప్రాంతాన్ని సందర్శించిన అహ్మదాబాద్ పోలీసు కమిషనర్ పిసి పాండే వారికి రక్షణ కల్పిస్తానని హామీనిచ్చారు. పోలీసు స్టేషన్‌లో 130 మంది పోలీసులు, టియర్ గ్యాస్ షెల్స్, ఇతర ఆయుధాలన్నీ ఉన్నప్పటికీ సంఘటనా స్థలానికి రాలేదు. హంతక ముఠా ఆ ఇంటిని అగ్నికి ఆహుతి చేసిన ఐదు గంటల తర్వాత పోలీసులు వచ్చారంటే ఈ దమనకాండలో ప్రభుత్వ పాత్ర ఎంత ఉందో తెలుస్తోంది. ఎహసాన్ జాఫ్రీ సహా వందలాది ముస్లింలు సజీవ దహనమయ్యారు. ఆయన భార్య జకియా జాఫ్రీ, కూతురు నిష్రీన్ హుస్సేన్ మరో ప్రాంతంలో ఉండడంతో మారణహోమం నుండి బయటపడ్డారు. సాక్ష్యాలు లభించలేదనే సాకుతో ఆ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదు. ఆరెస్సెస్, విహెచ్‌పి కార్యకర్తలు ఈ హత్యాకాండలో పాలుపంచుకున్న విషయాన్ని తెహల్కా స్టింగ్ ఆపరేషన్ ద్వారా ఆజ్‌తక్ ఛానెల్‌లో నాలుగు నెలల తర్వాత ప్రసారమవడంతో గుజరాత్ ప్రభుత్వ బండారం బయటపడింది.

సొహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్

మోడీ పాలనలో సొహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ మరో మాయని మచ్చగా నిలుస్తుంది. గుజరాత్ పోలీసులు నవంబర్ 26, 2005న చేసిన ఈ నకిలీ ఎన్‌కౌంటర్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చిల్లర నేరస్తుడైన సొహ్రాబుద్దీన్‌పై ఉగ్రవాద ముద్రవేసి ఎన్‌కౌంటర్ చేయడం వారి పాశవికతకు నిదర్శనం. నిజానిజాలు తేల్చకుండానే కేసును మూసివేసేందుకు గుజరాత్ ప్రభుత్వం ప్రయత్నించింది. మీడియా నిజాలు బయటపెట్టడంతో సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని దర్యాప్తును ముమ్మరం చేసింది. గుజరాత్ పోలీసుల గన్‌తో పేల్చిన బుల్లెట్‌కే సొహ్రాబుద్దీన్ మృతిచెందినట్లు గుజరాత్ ప్రభుత్వ తరపు న్యాయవాది కెటిఎస్ తుల్సీ సుప్రీం కోర్టులో అంగీకరించారు. సొహ్రాబుద్దీన్‌ను హతమార్చాలని గుజరాత్ హోం మంత్రి అమిత్ షా ఆదేశించినట్లు ఆరోపణలున్నాయి. అమిత్ షా ప్రోద్బలంతో గుజరాత్‌లోని వ్యాపారస్తుల నుండి బలవంతపు వసూళ్లు చేస్తున్న ముఠా ప్రమేయం ఈ ఎన్‌కౌంటర్‌లో ఉందని తెలిసింది. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని సిబిఐ విచారణలో తేలింది. దీంట్లో ప్రమేయమున్న పోలీసు ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. సొహ్రాబుద్దీన్ మధ్యప్రదేశ్‌లోని ఝూర్నియా గ్రామానికి చెందిన వ్యక్తి. ఉదయ్‌పూర్, అహ్మదాబాద్, ఉజ్జయిన్‌లలో చేసిన నేరాలకు సంబంధించి 13 కోర్టు కేసులు అతడిపై పెండింగ్‌లో ఉన్నాయి. దావూద్ ఇబ్రహీం ముఠాతో సంబంధాలు కలిగి ఉన్న అబ్దుల్ లతీఫ్ గ్యాంగ్‌లో సొహ్రాబుద్దీన్ డ్రైవర్‌గా పనిచేశాడు. రాజస్థాన్‌లోని మార్బుల్ ఫ్యాక్టరీ యజమానులకు లంచాలు తీసుకొని లైసెన్సులు ఇప్పించే ముఠా గుజరాత్‌లో నడుస్తోంది. ఈ ముఠాలో గుజరాత్ ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు చాలామంది ఉన్నారు. ఈ ముఠాతో వచ్చిన విభేదాలే సొహ్రాబుద్దీన్ హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది.

హత్య ఎలా జరిగింది?

సొహ్రాబుద్దీన్ నవంబర్ 23, 2005న భార్య కౌసర్ బీతో కలిసి ఆర్టీసీ బస్సులో హైదరాబాద్ నుండి మహారాష్ట్రలోని సంగ్లీకి ప్రయాణమయ్యాడు. అర్ధరాత్రి 1:30కు గుజరాత్‌కు చెందిన ఉగ్రవాద నిరోధక పోలీసు బృందం బస్సును మార్గ మధ్యలో ఆపి సొహ్రాబుద్దీన్, కౌసర్ బీలను అపహరించుకు వెళ్లింది. కౌసర్ బీని అహ్మదాబాద్ శివారులో గల దిషా ఫామ్‌హౌజ్‌కు తీసుకెళ్లారు. మూడు రోజుల తర్వాత సొహ్రాబుద్దీన్‌ను అహ్మదాబాద్ సమీపంలో గల విశాల్ సర్కిల్ హైవేపై ఎన్‌కౌంటర్ చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌పై గుజరాత్ పోలీసు సిబిడికి చెందిన గీతా జోహ్రి సుప్రీం కోర్టులో దాఖలు చేసిన రిపోర్టు కథనం... "నవంబర్ 26

ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- మల్లికా సారాబాయ్

దీక్ష పేరుతో 60 కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన మోడీ ప్రజలకు ముందు క్షమాపణలు చెప్పాలని ప్రముఖ నర్తకి, సంఘసేవిక మల్లికా సారాబాయ్ డిమాండ్ చేశారు. దీక్షకు ఖర్చు చేసిన డబ్బులతో 2002 గోద్రా అనంతర ఘటనల బాధితులకు భోజనం పెట్టి తొలుత ఆ పాపం నుండి విముక్తి పొందాలని సూచించారు. మోడీ దీక్షకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేసిన సారాబాయ్‌ని, 2002 బాధితులను అరెస్టు చేశారు. బాధితులకు న్యాయం జరిగేవరకూ, వారికి 'సద్భావన' ఉండదు. 2002 బాధితులకు గుజరాత్ ప్రభుత్వం నుండి పరిహారం ఇప్పించేందుకు వారి తరఫున సారాబాయ్ సుప్రీం కోర్టులో పోరాడుతున్నారు. అత్యున్నత న్యాయస్థానంలో దీనికి సంబంధించి ఏప్రిల్ 2002లో పిల్ దాఖలు చేశారు. ఆ కేసులో బాధితుల తరఫున వాదిస్తున్న న్యాయవాదులకు మోడీ ప్రజల సొమ్మును లంచంగా ఇచ్చారని సారాబాయ్ ఆరోపించారు. "రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ ఆర్‌బి శ్రీకుమార్, డిప్యూటీ చీఫ్ సంజీవ్ భట్‌లను మోడీ పిలిచి పిల్ ప్రొసీడింగ్స్‌ను తప్పుదోవ పట్టించేందుకు సారాబాయ్ తరపు న్యాయవాదులకు పది లక్షల రూపాయల లంచం ఇవ్వాలని పురమాయించారు. సీక్రెట్ సర్వీసెస్‌కు చెందిన డబ్బునే వాళ్లకు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. దానికి సంబంధించిన వివరాలు అఫిడవిట్‌లో పొందుపర్చాను" అని సారాబాయ్ అన్నారు.



తెల్లవారుజాము నాలుగు గంటలు... ఎటిఎస్ (యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్) వెనక గల యార్డులో గల హీరోహోండా మోటార్ సైకిల్ తీసుకురావాలని కానిస్టేబుల్ అజయ్ పర్మార్‌ను కోరారు. సొహ్రాబుద్దీన్‌కు కూడా తీసుకొచ్చారు. డ్రైవింగ్ చేస్తున్న రాజస్థాన్ పోలీసుకు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఆ బైక్ పైనుండి జంప్ చేశాడు. ఆ బైకు కిందపడిపోగానే సొహ్రాబుద్దీన్‌ను కారు నుండి రోడ్డుపైకి తోసేశారు. నలుగురు పోలీసు ఇన్‌స్పెక్టర్లు తమ సర్వీసు పిస్టల్స్‌తో ఎనిమిది రౌండ్లు కాల్పులు జరిపారు. తర్వాత సొహ్రాబుద్దీన్‌ను సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిందిగా పర్మార్‌ను డైరెక్టర్ జనరల్ వన్‌జరా ఆదేశించారు. రెండు రోజుల తర్వాత సొహ్రాబుద్దీన్ మృతి చెందాడు. కౌసర్ బీని బిజెపి నేత సోదరుడైన జిరావాలాకు చెందిన అర్హాన్ ఫామ్ హౌస్‌కు తరలించారు. అక్కడ కౌసర్ బీ గొంతు నులిమి హత్య చేశారు. ఆ శవాన్ని వన్‌జరా స్వగ్రామంలో పూడ్చిపెట్టారు. కౌసర్ బీని చంపి, కాల్చివేసిన విషయాన్ని సుప్రీం కోర్టులో గుజరాత్ ప్రభుత్వం అంగీకరించింది. ఈ కేసులో రాజకీయ ప్రమేయం ఉందని గీతా జోహ్రీ అభిప్రాయపడ్డారు.

మీడియా ద్వారా బయటి ప్రపంచానికి...

ఈ ఎన్‌కౌంటర్ ఘటన ఏడాది తర్వాత మీడియా బయటపెట్టే వరకూ ప్రపంచానికి తెలియదు. జర్నలిస్టు ప్రశాంత్ దయాల్‌తో కలిసి పోలీసు ఇన్‌స్పెక్టర్లు మద్యం సేవించారు. ఈ మత్తులో చెప్పిన మాటల్లో ఈ ఎన్‌కౌంటర్ విషయం బయటపడింది. తర్వాత దయాల్ ఫామ్‌హౌస్‌లో, డిజి స్వగ్రామంలో సొంతంగా చేసిన విచారణలో నిజాలు బయటపడ్డాయి. నవంబర్, 2006లో గుజరాత్ ప్రముఖ దినపత్రిక దైనిక్ జాగరన్‌లో ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన కథనం ప్రచురితమైంది. కౌసర్ బీ హత్య కూడా అప్పుడే వెలుగులోకి వచ్చింది. సొహ్రాబుద్దీన్ సోదరుడు సుప్రీం కోర్టులో వేసిన కేసు ద్వారా డొంకంతా కదిలింది. ఈ కేసుతో సంబంధమున్న సీనియర్ పోలీసు అధికారులను అరెస్టు చేశారు. ఏప్రిల్ 24, 2007న డిజి వన్‌జరా, ఇంటెలిజెన్స్ బ్యూరో ఎస్‌పి రాజ్‌కుమార్ పాండ్యన్, మరో ఎస్‌పి ఎమ్‌ఎన్ దినేష్‌లను అరెస్టు చేశారు. గుజరాత్ సీనియర్ పోలీసు అధికారి అభయ్ చుదాసమా కూడా అరెస్టయ్యారు. రాజకీయ నాయకుల ప్రమేయంపై కూడా దర్యాప్తు చేసిన తర్వాత జూలై 2010న హోం మంత్రి అమిత్ షా అరెస్టయ్యారు. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు అమిత్ షాపై ఉన్నాయి. ఈ కేసులో గుజరాత్ ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యం ఉందని ఆధారాలు లభించాయి. దీంతో గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీని కూడా విచారించాలని సిబిఐ భావిస్తోంది. నిజాలను బయట పెట్టిన జోహ్రీని ఈ కేసు విచారణ నుండి గుజరాత్ ప్రభుత్వం తప్పించింది. దీనిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజస్థాన్ బిజెపి ప్రభుత్వానికి చెందిన మంత్రులు గులాబ్ చంద్, ఓం ప్రకాశ్ మాథుర్‌ల పేర్లు కూడా ఈ కేసులో వినవచ్చాయి. సొహ్రాబుద్దీన్‌ను తుదముట్టించేందుకు ఆర్‌కె మార్బుల్స్‌కు చెందిన ఆర్‌కె పట్నీ పైమంత్రులకు పది కోట్ల రూపాయల లంచం ఇచ్చినట్లు సిబిఐ ముందు ఒక సాక్షి అంగీకరించాడు.

మోడీ పాలనలో మాయగాళ్లు

సిట్ దర్యాప్తు ప్రకారం స్వయంగా నరేంద్ర మోడీ 2002 గోద్రా దుర్ఘటన అనంతర దమనకాండకు సూత్రధారి. ఈ దమనకాండకు సంబంధించిన రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో రికార్డులను మోడీ సూచన మేరకే నాశనం చేశారు. అల్లర్లు జరిగిన సమయంలో సీనియర్ మంత్రులు అశోక్ భట్, ఐకె జడేజా పోలీసు కంట్రోల్ రూంలోకి ప్రవేశించి (పోలీసు అధికారులు మాత్రమే వెళ్లాల్సిన చోటు) కింది స్థాయి పోలీసు అధికారులకు నేరుగా ఆదేశాలిచ్చారు. హిందూ ఉగ్రవాదుల దౌర్జన్యం పెచ్చరిల్లడానికి వారి చర్యలు ఉపకరించాయి. పైపెచ్చు తమకు ముఖ్యమంత్రి మోడీ ఆశీస్సులు ఉన్నాయని దబాయించారని సిట్ ఛైర్మన్ తెలిపారు. నరోడా గావ్, నరోడా పాటియా ప్రాంతాల్లో ఇళ్లను దగ్ధం చేసి, ముస్లింలను ఊచకోత కోసిన సంఘటనలో ప్రత్యక్ష ప్రమేయం గల విహెచ్‌పి నాయకుడు జైదీప్ పటేల్‌తో ఒక మంత్రి సెల్ ఫోన్‌లో మాట్లాడినట్లు ఆధారాలున్నాయి. ఆ సమయంలో పోలీసు వైర్‌లెస్ కమ్యూనికేషన్‌ను కూడా గుజరాత్ ప్రభుత్వం నిలిపివేసింది. అహ్మదాబాద్‌లో భారీ సంఖ్యలో ముస్లింలను ఊచకోతకు గురైన అహ్మదాబాద్‌ను సందర్శించని ముఖ్యమంత్రి మోడీ 300 కిలోమీటర్ల దూరంలో గల గోద్రాను తొలుత సందర్శించడం ద్వారా హింసాకాండ మరింత పెరగడానికి దోహదం చేశారు. ఈ కేసును వాదించడానికి విహెచ్‌పి-ఆరెస్సెస్‌కు చెందిన న్యాయవాదులను ప్రభుత్వం తరఫున నియమించారు. హోం శాఖ సహాయ మంత్రి గోర్ధాన్ జదాఫియా, మరో మంత్రి మాయాబెన్ కొద్నానీలు 2002 ఊచకోతలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని సిట్ ఆధారాలు సేకరించింది. నరోడా పాటాయాలా ఊచకోతలో మాయాబెన్ ప్రమేయంపై ఆధారాలు లభించాయి. హిందువులు పగతీర్చుకోడానికి అవకాశమివ్వాలని ముఖ్యమంత్రి మోడీ స్వయంగా చెప్పినట్లు పోలీసు అధికారులు స్వర్ణకాంత వర్మ, అశోక్ నారాయన్ సిట్‌కు తెలిపారు. హిందూ అరాచక గుంపును ఆపకూడదని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు కె చక్రవర్తి, కె నిత్యానందం, పిసి పాండే, పికె మిశ్రా సిట్ ముందు అంగీకరించారు. 2002 అల్లర్లలో సహకరించినందుకు పాండే (గుజరాత్ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్), మిశ్రా (గుజరాత్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్), నిత్యానందం

(గుజరాత్ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండి), నారాయన్ (రాష్ట్ర విజిలెన్స్ అధికారి)లకు రిటైర్మెంట్ తర్వాత కూడా మోడీ ప్రభుత్వం కీలకమైన పదవులిచ్చి రుణం తీర్చుకుంది. రిటైర్డ్ సిబిఐ అధికారి ఎకె మల్హోత్రా విచారణ ప్రకారం 2002 దమనకాండలో ప్రధాన దోషులు వరుసగా...1. ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ, 2. తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్వర్ణ కాంత వర్మ, 3. హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అశోక్ నారాయణ్, 4. డిజిపి కె చక్రవర్తి, 5. అహ్మదాబాద్ పోలీసు కమిషనర్ పిసి పాండే, 6. హెూం సెక్రటరీ కె నిత్యానందం, 7. ముఖ్యమంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీ పికె మిశ్రా, 8. ముఖ్యమంత్రికి కార్యదర్శి అనిల్ ముకిమ్.

మంత్రులనూ వదలని మోడీ

గుజరాత్ ప్రభుత్వంలో హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన హరేన్ పాండ్యా 2003లో అహ్మదాబాద్‌లో హత్యకు గురయ్యారు. లా గార్డెన్‌లో మార్నింగ్ వాక్ తర్వాత తన కారులో కూర్చుంటుండగా దుండగులు హతమార్చారు. పాండ్యా హత్య వెనుక ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ, అప్పటి ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీల హస్తం ఉందని సంఘ్ పరివార్‌లో, ప్రజల్లో ప్రచారంలో ఉంది. పాండ్యాకు బెదిరింపులు వచ్చిన దరిమిలా ఆయన కోరినప్పటికీ సరైన భద్రత కల్పించలేకపోయారని మోడీ, అద్వానీలపై ఆరోపణలున్నాయి. హరేన్ పాండ్యా అహ్మదాబాద్‌లోని ఎలిస్ బ్రిడ్జ్ నియోజకవర్గం నుండి బిజెపి అభ్యర్థిగా విజయం సాధించారు. చిన్నప్పటి నుండే ఆరెస్సెస్ కార్యకర్తగా పనిచేశారు. అహ్మదాబాద్‌లోని పాల్డీ ప్రాంతం నుండి మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. కేశుభాయ్ పటేల్‌కు గట్టి మద్దతుదారైన పాండ్యా గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీకి ప్రత్యర్థిగా నిలిచారు. దీంతో 2002 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు టికెట్ దక్కలేదు. గోద్రా రైలు దుర్ఘటనలో చనిపోయిన వారి మృతదేహాలను అహ్మదాబాద్‌కు తీసుకురావడానికి కేబినెట్ సమావేశంలో పాండ్యా వ్యతిరేకించారు. అలా చేస్తే మతకలహాలు పెచ్చరిల్లుతాయనేది ఆయన వాదన. అయితే ఇతర మంత్రులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రధాని పదవిపైనే కన్ను...

నరేంద్ర మోడీ 60 కోట్ల రూపాయలు ఖర్చుచేసి చేపట్టిన ఎయిర్ కండిషనర్ దీక్ష నిజంగా రాష్ట్రంలో 'సద్భావన' కోసమేనా..? మోడీ చెప్పినట్లు హిందూ, ముస్లింల మధ్య సద్భావన కోరుకుంటే మూడు రోజుల దీక్షకు ఖర్చు చేసిన డబ్బును ప్రజల కోసం వినియోగించొచ్చు. దీంతో 60 లక్షల నుండి రెండు కోట్ల మంది పేదలకు ఒక రోజు కడుపునిండా భోజనం (ఒక మీల్స్‌కు రూ.15/- చొప్పున) పెట్టొచ్చు. గుజరాత్‌లో కనీసం 400 మంది నిరుద్యోగులు పెరిగారు. ఎందుకంటే నెలకు కనీసం రూ.4000/- వేతనంతో 400 మందికి ఉద్యోగాలు ఇచ్చే అవకాశాన్ని గుజరాత్ ప్రభుత్వం కోల్పోయింది. ప్లానింగ్ కమిషన్ నివేదక ప్రకారం గుజరాత్‌లో 32 శాతం మంది పేదలు. హిందూ, ముస్లింలనే తేడా లేకుండా అందరి అభ్యున్నతి కోసమే ఈ సద్భావనా దీక్ష అని చెప్పిన మోడీ ముస్లింలు టోపీని ధరించేందుకు నిరాకరించారు. ఈ చర్య ద్వారానే ఆయన తన నిజ స్వరూపాన్ని బయటపెట్టారు. ముఖ్యమంత్రిగా వరుసగా మూడోసారి గెలుపొందిన మోడీ కన్ను ఇప్పుడు ప్రధానమంత్రి కుర్చీపై పడింది. రథయాత్ర చేపట్టి మళ్లీ ప్రధాని కావాలని భావిస్తున్న అద్వానీకి చెక్ పెట్టేందుకే మోడీ ఈ దీక్షను ఎన్నుకున్నట్లు సంఘ్‌పరివారమే అంటోంది.

- ఎం.డి.హసన్ షరీఫ్

ఎవరీ మల్లికా సారాబాయ్?

తల్లిదండ్రులు : మృణాళిని సారాబాయ్ (క్లాసికల్ డ్యాన్సర్), విక్రమ్ సారాబాయ్ (ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త)

జననం : మే 9, 1954, అహ్మదాబాద్ (గుజరాత్)

వృత్తి : కూచిపూడి, భరతనాట్యం డ్యాన్సర్

పిల్లలు : రేవంత (కుమారుడు), అనహిత (కుమార్తె)

మల్లికా సారాబాయ్ అహ్మదాబాద్‌లోని ఐఐఎం నుండి 1974లో ఎంబిఎ పూర్తి చేశారు. 1976లో గుజరాత్ యూనివర్శిటీ నుండి ఆర్గనైజేషనల్ బిహేవియర్‌లో డాక్టరేట్ చేశారు. ఆమె ప్రముఖ కొరియోగ్రాఫర్, డ్యాన్సర్. హిందీ, గుజరాతీ సినిమాల్లోనూ నటించారు. మల్లిక చిన్నప్పుడే డ్యాన్స్ నేర్చుకున్నారు. 15 ఏళ్ల వయస్సులో తొలి సినిమాలో నటించారు. మహాభారత్‌లో ద్రౌపది పాత్ర చేశారు. గోల్డెన్ స్టార్ అవార్డు, ఉత్తమ డ్యాన్సర్ సహా పలు పురస్కారాలు అందుకున్నారు. తల్లితో కలిసి దర్పణ అకాడమీ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్‌ను అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేశారు. సారాబాయ్ నర్తకే కాదు. సామాజిక కార్యకర్త కూడా. చిన్ననాటి నుండే ఆమె అభ్యుదయ భావాలు కలిగి ఉన్నారు. కాలేజీ రోజుల్లోనే బిపిన్ షాతో పరిచయమేర్పడింది. తర్వాత ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. అనంతరం మపిన్ పబ్లిషింగ్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఏడేళ్ల తర్వాత భర్త నుండి విడిపోయారు. 2009లో బిజెపి అగ్రనేత ఎల్‌కె అద్వానీకి వ్యతిరేకంగా గాంధీనగర్ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్‌గా లోక్‌సభకు పోటీ చేశారు. 1984లోనే రాజకీయాల్లోకి రాజీవ్ గాంధీ ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని తిరస్కరించిన సారాబాయ్ దిగజారిన రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా పోరాడేందుకు నడుం కట్టారు.

మోడీ X అద్వానీ

బిజెపి అగ్రనేత ఎల్‌కె అద్వానీ అవినీతిపై రథయాత్ర ప్రకటించిన వెంటనే మోడీ దీక్షను ప్రకటించడం వెనుక కుర్చీలాట కనబడుతోంది. 2014లో ప్రధాని కావాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న అద్వానీ రథయాత్ర ద్వారా ఈ కుర్చీలాటలో (తన పార్టీలో) అగ్రస్థానంలో నిలవాలని ఎత్తులు వేస్తున్నారు. ఆయనకు చెక్ పెట్టి ప్రధాని పదవికి ప్రధాన పోటీదారుగా నిలవాలని మోడీ పైఎత్తులు వేస్తున్నారు. గుజరాత్ మారణకాండకు సూత్రధారి, పాత్రధారి అయిన మోడీ.. ఆ ఘటన జరిగిన తొమ్మిదేళ్ల తర్వాత శాంతి జపం చేస్తూ ప్రజల చెవిలో పువ్వు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తమకు న్యాయం జరిగేవరకూ మోడీ జిత్తులను నమ్మేదిలేదని బాధిత ముస్లింలు అంటున్నారు. వేలాది మందిని ఊచకోత కోయించి, లక్షలాది కుటుంబాలను నిరాశ్రయులను చేసిన మోడీ తొమ్మిదేళ్ల తర్వాత వారి బాధను పంచుకోవడానికి దీక్ష చేయడం, వారి బాధను పంచుకుంటున్నాననడం ఆరు కోట్ల గుజరాతీయులనే కాదు...120 కోట్ల భారతీయులను వంచించడమే. గోద్రా దుర్ఘటన జరిగి పదేళ్లు కావస్తున్నా ఆ దుర్ఘటన బాధితులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. గోద్రా ఘటన జరిగిన తర్వాత గత తొమ్మిదేళ్లుగా శాంతి వ్రతం చేస్తున్న మోడీ చేతల్లో మాత్రం 2002 మత కలహాల బాధితులకు ఇప్పటికీ న్యాయం అందించలేకపోయారు.



చూద్దామా

వావ్! మమ్మీలు!!



ప్రపంచ వింతలు చూడాలని ఎవరికి మాత్రం అనిపించదు! మరీ ముఖ్యంగా వింతల్లోకెల్లా వింతయిన ఈజిప్ట్ పిరమిడ్స్! వాటిని చూసే అవకాశం వస్తే ఎలా ఉంటుంది? ఆనందం చెప్పతరం కాదు కదా! హైదరాబాద్ నుంచి కువైట్ ఎయిర్ లైన్స్ విమానం ఎక్కితే సరి. అది ముంబై, కరాచీ, షార్జాల మీదుగా పర్షియన్ గల్ఫ్ దాటుకుని కువైట్ చేరుకుంటుంది. భూమి నుండి 30 వేల కిలోమీటర్ల ఎత్తు నుండి కిందికి చూస్తుంటే కిందంతా మబ్బుల పందిరిలా కనిపిస్తుంది. దాని కిందున్న భూమి, ఎడారి, సముద్రం ఎంత అందంగా ఉంటాయో! ఇంతందమైన భూమిమీదేనా మనం ఉండేది అనిపిస్తుంది. ఆ మబ్బుల పందిరి దిగి ఈజిప్టులో కాలూనాక...

సమాధులను చేరడానికి సన్నటి సొరంగం లాంటి మెట్ల దారి



కువైట్‌లో దిగి అక్కడ కైరో ఫ్లైట్ ఎక్కాలి. అక్కడ్నుండి కైరోకి రెండున్నర గంటల ప్రయాణం.

ఇక్కడి వాతావరణం గురించి కొంచెం చెప్పుకోవాలి. మనలాగా అక్కడ వేసవి కాలం, వర్షాకాలం, శీతాకాలం వరుసగా రావు. సముద్ర తీరంలో అప్పుడప్పుడు పడే వర్షపు జల్లులు తప్ప అక్కడ వర్షాలు చాలా తక్కువ. ఏప్రిల్ నెలలోనైతే సహారా ఎడారి నుండి బాగా వేడిగాలులు వీస్తుంటాయి. ఆ సమయంలో ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువ.

నైలునదీ పరీవాహక ప్రాంతలో ఆరెంజ్, ఖర్జూర చెట్లు ఎక్కువగా ఉంటాయి. గ్రీన్‌హౌస్ ప్లాంటేషన్ ద్వారా క్యాబేజీ, టమాటా, బీన్స్ పండిస్తారు.

కైరో నుండి అలెగ్జాండ్రియాకి 250 కిలోమీటర్లు. అక్కడికి బస్సులో వెళ్లొచ్చు. ఇది ఈజిప్టుకు రెండో రాజధాని. ఈ నగరంలో విశ్వవిజేత అలెగ్జాండర్ తన విజయాలకు గుర్తుగా నిర్మించిన కోట చాలా బాగుంటుంది. దానిలో ప్రధాన భాగమైన స్థూపంలో చాలా వరకు శిధిలావస్థలో ఉంటుంది. కోట మాత్రం గ్రీకువీరుడి గొప్పదనాన్ని చాటుతుంది. ఈ నగరంలో చాలా బీచులున్నాయి. కైరోలో చాలామంది వేసవి విడిదిగా ఇక్కడికే వస్తుంటారు. అందుకే దీన్ని "సమ్మర్ రిసార్ట్ ఆఫ్ మిడిల్ ఈస్ట్" అని పిలుస్తారు.

కరెంటు కోత ఎక్కువే

కైరో అంటే విజయం సాధించిన మహిళ అని అర్థం. సిటీ అంతా అందమైన మినార్లు కనిపిస్తాయి. అసలు కైరో నగరాన్ని 'సిటీ ఆఫ్ మినారెట్స్' అని పిలుస్తారు.

ఈజిప్టులో కేవలం ఏడు శాతం భూభాగం మీదే ప్రజలు నివశిస్తున్నారు. మిగిలిందంతా సహారా ఎడారి. ఇక్కడి జనాభా 75 లక్షలు. వీరిలో అధిక శాతం ముస్లిములే.

ఇక ఇక్కడి వారంతా స్నేహ స్వభావులే. సిటీ అంతా అండర్ గ్రౌండ్ వైరింగ్. కానీ మనకున్నట్లే ఇక్కడా విద్యుత్ సమస్య ఉంది. రోజుకు ఏడు గంటలు పవర్ కట్ ఉంది. మరో ముఖ్యమైన విషయం... ఇక్కడ పెట్రోలు ధర చాలా తక్కువ. మిగతావి మాత్రం ఎక్కువ ధరలే ఉన్నాయి.

ఇక్కడ ఆటోలు, రిక్షాలు, సైకిళ్లు అస్సలు కనిపించవు. అన్నీ టాక్సీలే. అవి కూడా నలుపు, తెలుపు రంగుల్లోనే ఉంటాయి. ఆ దేశ వాసులంతా కార్లు, ట్రాములు, బస్సుల్లోనే ప్రయాణిస్తారు. ఇక్కడ చాలామందికి సొంత వాహనాలే వున్నాయి. రోడ్లు చాలా శుభ్రంగా కనిపిస్తాయి.

ఇక్కడ నేషనల్ లైబ్రరీ చాలా పెద్దది. ఈజిప్టు చరిత్రను, పిరమిడ్ల కథలను తెలియజేసే పుస్తకాలైతే బోలెడు. ముఖ్యమైన విషయం ఏంటంటే... ఈ లైబ్రరీలోని లైట్లన్నీ సౌరశక్తితో వెలుగుతాయి.

ఇంత బంగారమా!?

కైరోకి మూడు కిలోమీటర్ల దూరంలో నైలు నదీ తీరాన అంతెత్తులో ఉన్న పిరమిడ్లని చూడగానే మైమరచిపోతాం. కాలాన్ని గెలిచామనడానికి గుర్తుగా గంభీరంగా తలెత్తుకుని నిల్చున్నట్లుంటాయి. మనిషిలోని ఆత్మవిశ్వాసానికి ప్రతీకల్లా కనిపిస్తాయి. ఇక్కడ చాలా పిరమిడ్లు వున్నాయి. లోపలి సమాధులను చేరాలంటే సన్నటి సొరంగం లాంటి మెట్ల దారిగుండా వంగి నడిచి వెళ్లాలి. వాటి పక్కనే పట్టపురాణుల సమాధులూ ఉంటాయి. మరో ముఖ్యమైన నిర్మాణం గ్రేట్ స్పింక్స్ ఆఫ్ గిజా... మనిషి తల, సింహం శరీరంతో ఉన్న దీని ఎత్తు 65 అడుగులు. పొడవు 241 అడుగులు.

కైరోలో చూడాల్సిన ప్రదేశాల్లో మరొకటి... నేషనల్ మ్యూజియం. ఇది రెండతస్తుల నిర్మాణం. ఇందులో సుమారు 12 లక్షల అపురూప వస్తువులున్నాయట. వీటిలో ముఖ్యమైనవి మమ్మీలు, రాజ కుటుంబీకులు వాడిన ఆభరణాలు. ఇక్కడున్న వస్తువులన్నీ ప్రాచీన ఈజిప్టు నాగరికతను, ఆచార వ్యవహారాలను తెలుపుతాయి. ఫారోల కాలం నాటి మమ్మీలు 20 కి పైగా ఈ మ్యూజియంలో కనిపిస్తాయి. టుటాంఖామెన్ మమ్మీకైతే శరీరం మొత్తం బంగారపు తొడుగే. లోపలున్న శవ పేటికా బంగారపుదే. ఇక రాజులు ఉపయోగించిన బంగారపు మంచాలు, కుర్చీలు, బల్లలు, పెట్టెలు, ఆభరణాలు... ఇలా ఒకటేమిటి ఎన్నో వస్తువులు (అన్నీ బంగారంతో చేసినవే) ఇప్పటికీ ఇక్కడ కనిపిస్తాయి. వాటన్నింటినీ చూసి ఇప్పటి ధరలను తలచుకుని అమ్మో! ఇంత బంగారమే!! అనుకోకుండా వుండలేం. మరో విషయమేంటంటే... ఈ వస్తువుల్లో ఎక్కువ భాగం టుటాంఖామెన్ సమాధిలో దొరికినవేనట. మ్యూజియంలోకి వెళ్లడానికి ఎటువంటి ప్రవేశ రుసుములేదు. కానీ మమ్మీల ఛాంబర్‌కి వెళ్లడానికి మాత్రం ఒక్కో టిక్కెట్ 100 పౌండ్లు.

ప్రతిరోజూ సాయంత్రం ఆరున్నర నుండి తొమ్మిదింటి వరకు పిరమిడ్ల దగ్గర లైట్ అండ్ సౌండ్ షో జరుగుతుంది. దీనిక్కూడా టిక్కెట్ ధర 100 పౌండ్లు. ఇందులో ఈజిప్టు చరిత్రంతా మన కళ్లముందే జరిగినట్లుంటుంది. మరో విషయం... చలి ఎక్కువగా ఉంటుంది కాబట్టి కప్పుకోడానికి రగ్గులు కూడా వాళ్లే ఇస్తారు.

నైలు నదిలో క్రూయిజ్, విద్యుత్ దీపాలతో వెలిగిపోయే కైరో నగరాన్ని వీక్షించడం ఓ మధురమైన అనుభూతి. పడవ ప్రయాణంలో బెల్లీ డాన్సులు, సంప్రదాయ నృత్యాలు చూసి తీరాల్సిందే కానీ చెప్పడానికి రాదు. అంత బావుంటుంది. ఇక్కడ ఇండియన్ ఫుడ్ దొరికే రెస్టారెంట్లు చాలా ఉన్నాయి. అవి కాకుండా తాజ్ ఇండియన్ రెస్టారెంటు కూడా ఉంది. ఇక్కడ షాపింగంటే ఇష్టపడేవాళ్లూ ఆ సరదా తీర్చుకోవచ్చు. బోలెడు షాపింగ్ మాల్స్. ఇక్కడికొచ్చిన పర్యాటకులు ఎక్కువగా స్థానికంగా తయారు చేసే ఈజిప్షియన్ కాటన్ దుస్తులు, పెయింటింగులు, మెటాలిక్ ఆభరణాలు కొంటుంటారు. ఈజిప్టు టూర్‌కి మనిషికి సుమారుగా 50 వేల రూపాయలు ఖర్చవుతుంది. ★


అందమైన మినార్లు

టుటాంఖామెన్ మమ్మీ


నేషనల్ మ్యూజియం


అలెగ్జాండర్ విజయాలకు గుర్తుగా నిర్మించిన కోట

అట్టమీది కథ

బైక్ క్రేజీ...

- డా॥ కాకర్లమూడి విజయ్

సినీ నటుడు బాబూమోహన్ కుమారుడు, కోట శ్రీనివాసరావు పుత్రుడు, క్రికెట్ క్రీడాకారుడు అజారుద్దీన్ సుపుత్రుడు... వీరందరికీ ఉన్న సాపెత్తమేమిటో అందరికీ తెలుసు. వారందరూ మితిమీరిన వేగం కారణంగా జరిగిన ప్రమాదాల్లో అకాల మృత్యువాత పడ్డవారే. వీరే కాదు, మరెందరో వేగంగా ప్రయాణిస్తూ, వేగంగా వాహనాలను నడుపుతూ, లేదా వేగంగా వచ్చే వాహనాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఇంకా కోల్పోతున్నారు.

ఈ మధ్యకాలంలో జూబ్లీహిల్స్ ప్రాంతంలోని రోడ్లపై (అవి ఎప్పుడూ మిగతా నగర రోడ్లకన్నా మెరుగ్గా ఉంటాయి కాబట్టి!) రాత్రుళ్లు బైక్ రేసులు నిర్వహిస్తున్నారట. చాలా కాలం నుండీ నెక్లెస్ రోడ్డులో కుర్రకారు మితిమీరిన వేగంతో బైకులు నడుపుతూ, వారు ఆనందం పొందుతూ మిగతా వారికి భయాన్ని కలిగిస్తున్నారు. మిగతా రోడ్లపై రద్దీ ఎక్కువ వుండడం వల్లగానీ, లేకుంటే ప్రతి రోడ్డూ రేస్ ట్రాకుల్లా వాడేసే వాళ్లు చాలామందే ఉన్నారు.

వేగం, యువత విడదీయలేనివి. అలాగని యువత కానివారు వేగాన్ని ఇష్టపడరా అంటే అటువంటిదేమీ లేదు. వేగం చాలామందికి ఇష్టం. ముఖ్యంగా యువతకు ప్రాణం. ఆ వయసులో హార్మోన్ల ప్రభావం అటువంటిది. వేగాన్ని

ఒకానొక తెల్లవారుజామున సినీనటుడు బాబూమోహన్ కుమారుడు పవన్ ద్విచక్రవాహనం రోడ్ డివైడర్‌కి గుద్దుకుని చనిపోయాడు. సడెన్ బ్రేక్ వేయడం వల్ల ప్రమాదం జరిగిందని నిర్ధారించారు.

ఒకానొక పగటిపూట ద్విచక్రవాహనాలను నిషేధించిన రోడ్డుపై బైక్ మీద వేగంగా వెళ్తూ ఒక ట్రక్‌కి గుద్దుకుని సినీనటుడు కోట శ్రీనివాసరావు కుమారుడు ప్రాణాలు విడిచాడు. అతి వేగం వల్ల అదుపు చేయలేని పరిస్థితి కారణమని నిర్ధారించారు.

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కుమారుడు అయాజుద్దీన్ ఒక స్పోర్ట్స్ బైక్ పై (బైక్‌లు నిషేధించిన రోడ్డుపైనే!) మితిమీరిన వేగంతో వెళ్తూ అదుపు తప్పి పడి, గాయాలతో ప్రాణాలు వదిలాడు. మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు కన్నా ఫణీంద్ర రాజ్‌భవన్ రోడ్డులో స్పోర్ట్స్ బైక్ నడుపుతూ ప్రమాదంలో చిక్కుకుని, గాయాలతో బయటపడ్డాడు.

అర్ధరాత్రి వేళ సికింద్రాబాద్ ఫ్లైఓవర్ మీద వేగంగా బైక్ నడుపుతూ అదుపు చేయలేక ఆగివున్న వాహనాన్ని ఢీకొట్టి మరణించారు ఇద్దరు కుర్రాళ్లు.

ఇటువంటి సంఘటనలు వార్తలుగా వచ్చినవి కొన్నే గానీ అనేకం జరుగుతూనే ఉన్నాయి. వీటిని నియంత్రించవలసింది మనకు మనమే.

వేగం, యువత విడదీయలేనివి. అయితే వేగం అధికమైనప్పుడు అప్రమత్తత తగ్గుతుంది. అదుపు చేసే పట్టు జారుతుంది. జరగకూడనిది జరుగుతుంది.



ప్రదర్శించడానికి వాహనాలకంటే మెరుగైన వెసులుబాటు ఇంకేముంటుంది? అందులోనూ ద్విచక్రవాహనాలను మించిన థ్రిల్ ఇంకేమిస్తాయి? అందుకే అటువంటి 'స్పీడ్' వాహనాలు దొరికితే చాలనుకునేవారు అనేకం.

ద్విచక్రవాహనాల ప్రమాదాలు మనదేశంలో కొత్త కాదు. కానీ అటువంటి ప్రమాదాల్లో రెండో వాహనం లేకుండా ... తాము నడిపే వాహనం వల్లే ప్రాణాలు సంకటంలో పడిన సందర్భాలూ ఉన్నాయి. అజారుద్దీన్ కుమారుడి సంఘటనలో మరో వాహనం లేనే లేదు. అతను నడిపిన వాహనం 1000సిసి సూపర్ బైక్ (మన రోడ్లపై సాధారణంగా నడిచే వాహనాలు 100 - 150 సిసి సామర్థ్యం గలవే). అంతటి శక్తిగల బైకులు అత్యంత వేగాన్ని అత్యంత తక్కువ సమయంలో అందుకోగలవు. ప్రమాదం జరిగిన సమయంలో అయాజుద్దీన్ గంటకు 200 కిలోమీటర్ల వేగంతో నడిపి ఉండొచ్చని అంచనా.

అతి వేగంలో ప్రమాదం జరగడానికి కారణం ఓ బండ రాయో, మరో వాహనమో కానవసరం లేదు. చిన్న కంకరరాయి కూడా ఛిన్నాభిన్నం చేయగలదు. వేగంగా వెళ్తున్నంత వరకూ బాగానే ఉంటుంది కానీ అదుపు చేసే క్రమంలోనే ఇబ్బందులు ఎదురౌతాయి. బ్యాలెన్స్ తప్పిన వాహనాన్ని... అదీ అంత వేగంలో కంట్రోల్ చేయడం మరింత కష్టం. ఇటువంటి ప్రమాదాల్లో మరో ఇబ్బంది ఏమిటంటే, వాహనం పైనుండి పడిపోయిన చోదకుడు కూడా సుమారు అదే వేగంతో ఈడ్చబడతాడు. ఆ మార్గంలో ఏవైనా అడ్డంకులు వుంటే, వాటిని కొట్టుకుంటూ, దొర్లుకుంటూ... ఘోరమైన పరిస్థితిని అనుభవిస్తాడు (అప్పటికి స్పృహలో ఉంటే).

గంటకు 20-30 కిలోమీటర్ల వేగంతో వెళ్తేనే బైక్‌లపై ప్రమాదాలు ప్రాణాంతకమయ్యే అవకాశాలు అధికం. మరి అంతకు పదింతల వేగమంటే మాటలా?

కాదు. అయినా ఆ విచక్షణ, 'ఆ' వయసు, ఆ సందర్భంలో ఉండవంటారు డా॥గణేష్. "యువకుల్లో 'అడ్రినాలిన్' అనే హార్మోన్ ప్రభావం వల్ల ఆవేశం, ఉత్సాహం గరిష్ట స్థాయిలో ఉంటాయి. ఆ ప్రభావంలో సాధారణంగా భయాన్ని బయటపడనీయరు. ఎదురుగా కోరుకున్న బైక్, అది నడిపేందుకు ఆహ్వానం పలికే రోడ్డు ఉంటే మిన్నకుండడం కష్టం. ఒకసారి బండి స్టార్ట్ చేస్తే ఇక వేగాన్ని పెంచకుండా ఉండడమూ కష్టమే. అదే అడ్రినాలిన్ తమాషా".

వేగంగా వెళ్లడానికి స్పీడ్ బైకులు అందరికీ అందుబాటులో లేవు. అయినా ఉన్న బైకులపైనే వెళ్లగలిగిన వేగాన్ని అందుకోడానికి ప్రయత్నించడం ఎవరూ మానలేదు. "మా డాడీకి స్కూటరుండేది. నాకు అది నచ్చక హీరోహోండా కొనుక్కున్నాను. మా అబ్బాయికి అది నచ్చలేదు. పల్సర్ కావాలని కొనుక్కున్నాడు. నేను చేయగలిగింది అంతవరకే. దానిపై ఎంత వేగంగా వెళ్తున్నాడో నేను కంట్రోల్ చేయలేను కూడా. ఆ విచక్షణ అతనికుండాలి" అని వివరించారు డాక్టర్.

"స్పీడ్‌గా వెళ్లే బైక్‌ని నెమ్మదిగా నడపాలంటే చిరాగ్గా ఉంటుంది. కాస్త ఖాళీ రోడ్డు కనిపిస్తే చాలు, ఆటోమేటిగ్గా యాక్సలరేటర్ పెంచేస్తాం. ఒకటి రెండుసార్లు ప్రమాదాలు కొద్దిలో తప్పిపోయాయి. అయినా జాగ్రత్తగానే డ్రైవ్ చేస్తాను" అన్నారట డాక్టర్ గారి సుపుత్రుడు రోహిత్. అతనూ, అతని స్నేహితులూ కలిసి ఆదివారాలు బైక్ రైడింగ్‌కి వెళుంటారు. "మా ఫ్రెండ్స్ అయితే ఇంకా ఖరీదైన బైక్స్ తెస్తారు. వాటిపై రకరకాల స్టంట్స్ చేస్తారు కూడా. కొన్ని సార్లు మాకే భయమేస్తుంది. కానీ ఖాళీ రోడ్లు స్పీడ్ బైకులూ కనిపిస్తుంటే మిగతావేవీ కనిపించవు. అయితే ఇవన్నీ ఇంట్లో తెలిస్తే ఒప్పుకోరు" అన్నాడు రోహిత్.

మన రహదారులపై అక్కడక్కడా "స్పీడ్ థ్రిల్స్, బట్ కిల్స్" అనే బోర్డులుంటాయి. అంటే వేగం థ్రిల్‌నిస్తుంది. కానీ ప్రాణాల్ని తీస్తుంది అని. స్పీడ్ బైక్‌ల పట్ల ఇది నూటికి నూరుపాళ్లూ వర్తిస్తుంది. స్పీడ్ బైక్ అంటే కనీసం 800 సిసి ఇంజన్ సామర్థ్యం కలిగి ఉంటుంది. మారుతి 800 కారు సామర్థ్యం అది! ఆ బైకులు 200 బిహెచ్‌పి (బ్రేక్ హార్స్‌పవర్) పైగా శక్తిని అందించి, క్షణాల్లో 0 నుండి 120 కిలోమీటర్ల (గంటకు) వేగాన్ని అందుకోగలవు. మామూలుగా 100 సిసి బైకులు సుమారు 100 కిలోల బరువున్నా, అవి విడుదల చేసే శక్తి సుమారు 15 బిహెచ్‌పి మాత్రమే. అందువల్ల అధిక బిహెచ్‌పి గల వాహనాలను నడపడం అంత సులువుకాదు.

అంతే కాకుండా, అటువంటి బైకులను మామూలు రోడ్లపై, మామూలు వేగంలో నడపడమూ మలుపులు తిప్పడము కూడా కష్టమే అంటారు అనుభవమున్న బైక్ రేసర్లు.

మరో విషయమేమిటంటే సదరు సూపర్ బైకుల టైర్లు నునుపైన రోడ్లకు అనువైనవి. మన రోడ్లపై ఇవి సరిగా పనిచేయవు.

సూపర్ బైకులు మన దేశంలో తయారు కావు. వాటి ధరకు రెట్టింపు కంటే అధికంగా దిగుమతి పన్ను చెల్లించి మరీ తెప్పించుకోవాలి. అన్ని లక్షలు బైకుకు పెట్టినప్పుడు మరో ఒకటి రెండు లక్షలతో ఆ బైకులను నడపడానికి అనువైన రేసింగ్ సూటు కొనుక్కోవడమూ ముఖ్యమైన అంశం. కానీ చాలామంది ఇది పట్టించుకోరు. నాణ్యత గల రేసింగ్ సూటు, బుల్లెట్ ప్రూఫ్ దుస్తులు తయారు చేసే పదార్థంతో తయారౌతుంది. దానిలో గాలి తిత్తులు కూడా ఉంటాయి. ప్రమాదవశాత్తు కింద పడినా కూడా శరీరానికి తగిలే దెబ్బల తీవ్రతను తగ్గిస్తుంది ఆ సూట్. అలాగే నాణ్యత గల హెల్మెట్, మోకాలికీ మడమలకీ ప్యాడ్స్ వంటివి అవసరం. ఇవన్నీ సక్రమంగా ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగినా ప్రాణ హాని వుండదు. రేసుల్లో రైడర్లు విపరీతమైన వేగంతో కిందపడ్డా ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అరుదు.

"అయినా హెల్మెట్లూ, రేసింగ్ సూట్లూ వేసుకోవడం కుర్రాళ్ల తత్వానికి విరుద్ధం. వాళ్లు అటువంటి బైక్‌లు, వాటిపై విన్యాసాలు చేసేది ఇతరులకి 'చూపించడం' కోసమే" అంటారు లెక్చరర్ రవి. 'అమ్మాయిల ముందు 'ఫోజు' కొట్టడానికి వాళ్లు



సూపర్ బైక్

అతివేగం, ఆ వేగాన్ని అతి త్వరగా అందుకోవడం, అంత వేగంలోనూ పటిష్టమైన బ్రేకులుండడం స్పోర్ట్ బైకుల ప్రాథమిక లక్షణాలు. ఆ కారణంగా వాటిలో సౌకర్యం, మైలేజీ కొరవడుతుంది.

ఈ తరహా బైకులు 1950 లలోనే పుట్టాయి. మొదటి సూపర్ బైక్‌గా పేరొందిన హోండా సిబి750 1969లో రూపొందింది. అప్పట్లో దాని గరిష్ట వేగం గంటకు 201 కిలోమీటర్లు.

ఇప్పుడు మన దేశంలోనే కొన్ని కంపెనీలు సూపర్ బైకులను విక్రయిస్తున్నాయి. హార్లీ డేవిడ్‌సన్, సుజుకీ, యమహా, హోండా, కవాసాకీ, డ్యూకాటీ కంపెనీల సూపర్ బైకులు మహా శక్తివంతమైనవి. అన్నీ దాదాపు 1000 సిసి పైనవే. ఇవన్నీ 0 నుండి 100 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 3-4 సెకన్లలో అందుకోగలవు. ఇవి గంటకు 300 కిలోమీటర్లు గరిష్ట వేగంతో ప్రయాణించగలవు.

మామూలు బైకులకంటే సూపర్ బైకుల ఇంజన్ పెద్దది, బరువైనది. ఆ క్రమంలో భారీ ఫ్రేమూ, గేర్లూ వగైరాల వల్ల అసలు మోటర్ సైకిలే భారీగా కనిపిస్తుంది. అలాగే సూపర్ బైకుల 'త్రాటిల్' (మామూలుగా యాక్సెలరేషన్ అంటాము) సాధారణ బైకులకంటే పదింతలు శక్తివంతమైనది.

సూపర్ బైకు బ్రేకులు కూడా మామూలు బైకుల కంటే చాలా మెరుగైనవి. విపరీతమైన వేగం నుండి క్షణాల్లో నెమ్మదిగా ఆగే వీలు కలిగిస్తాయి. కానీ అవి చాలా సున్నితమైనవి కూడా. అంటే సుతారంగా ఒత్తినా పనితనం చూపుతాయి. ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా (కాస్త గట్టిగా బ్రేకులని నొక్కితే) బండి స్కిడ్ అవ్వడం ఖాయం.

సూపర్ బైకులు పొడవైనవి, వెడల్పైనవి కావడం వల్ల చిన్న చిన్న మలుపులు సులభంగా తిరగవు. వేగంగా అయితే మరింత పెద్ద వృత్తం అవసరం.

నానా తంటాలు పడుతుంటారు. ఒక స్థాయి వచ్చాక వాళ్ల ఫోజు అమ్మాయిలకే పరిమితం కాదు" జోడించారు ఆయన.

"మన రోజుల్లో పెళ్లికో, ఉద్యోగంలో చేరాకో ఓ చిన్న సంసారపక్ష వాహనం సమకూరేది. ఇప్పుడు ఇంటరు చదివే వాళ్లే ఖరీదైన బైకుల్లో వస్తున్నారు. బాధ్యతలు, విచక్షణ, అవగాహన సరిగ్గా ఉండని వయసులో డబ్బుంది కదాని ఖరీదైన ఫోన్లు, బైకులూ ఇస్తే పరిణామాలు, పర్యవసానాలు ఎప్పుడూ దారుణంగానే ఉంటాయి. ఈ విషయం తల్లిదండ్రులు గ్రహించాలి. బైకు కొనిచ్చి, దాన్ని వాడొద్దు, దానిపై స్పీడుగా వెళ్లొద్దు అని ఎన్ని చెప్పినా ఫలితం ఉండదు. కానీ చాలా సార్లు ఆ విషయం తెలిసే సరికే పరిస్థితి చేజారిపోతుంది" అంటారు రవి.

సూపర్ బైకులు కానీ, మరే వాహనాలు కానీ మృత్యుశకటాలు కావు. వాటిని నడిపే వారి అజాగ్రత్త, అనుభవ రాహిత్యం, తొందరపాటు, స్పందనా రాహిత్యం వంటి వాటివల్ల ప్రమాదాలు జరుగుతాయి.

కేవలం మనం జాగ్రత్తగా ఉంటేనే ప్రమాదాలు జరగవు అనేం లేదు. మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా ఎన్నో ఇతర అంశాలు ప్రమాదాలని కలిగించవచ్చు. రోడ్లపై చిన్న గుంట నుండి ఎదురుగా వచ్చే వాహనాలు, రోడ్డు దాటడానికి ప్రయత్నించే వారి వరకూ ఏదైనా మనకి ప్రమాదం కలిగించవచ్చు.

ఇతర దేశాల్లో అయితే స్పీడ్ బైక్‌ల కొనుగోలు అంత సులభంకాదు. సరైన తర్ఫీదు, బాధ్యత ఉన్నవారికే అవి అమ్మబడతాయి. కెనడాలో 57 ఏళ్ల వ్యక్తి పూర్తి డబ్బుతో వచ్చినా కూడా అతను బైక్ నడిపి రెండు దశాబ్దాలైందన్న కారణంగా బైక్ అమ్మడానికి బిఎమ్‌డబ్ల్యు కంపెనీ నిరాకరించింది. సదరు కంపెనీ నిర్వహించే ప్రత్యేక ట్రెయినింగ్ తీసుకున్న తర్వాత గానీ బైక్ కొనుక్కునే వీలులేదని తెగేసి చెప్పింది.

కానీ మనం అటువంటి 'సెంటిమెంట్లు' అంటిపెట్టుకోం. పిల్లల కోరిక ఏదైనా సరే తీర్చేసే స్థోమత గలవాళ్లు ఉన్నా , కాస్త ఉపేక్షించే ఆలోచనాపరులు ఒక వైపుంటే, కోరిందే తడవు తెచ్చిపెట్టడమే 'గొప్ప'గా భావించే మహామహులు మరో పక్క ఉన్నారు. పిల్లలకిచ్చే దేన్నైనా గానీ, సక్రమంగా, బాధ్యతా పూర్వకంగా వాడేలా చేయలేనప్పుడు అది వారికి ఇవ్వకపోవడమే మంచిది. అది పెన్నైనా, బైకైనా.

సురక్షిత ట్రాక్ ఏదీ!

డబ్బుంది, కోరికుంది కాబట్టి సూపర్ బైకులు, ఖరీదైన వాహనాలు కొనుక్కోగలుతున్నారు గానీ, వాటిని నడిపేందుకు సరైన రోడ్లు మనకు లేవు. వేగంగా వెళ్లగలిగే పట్టాలు సహకరించవేమో అన్న సందేహంతో రైలు వేగాన్ని పరిమితం చేసుకున్నాం మనం. అదే విధంగా స్పీడు వాహనాల కోసం ప్రత్యేక ట్రాకులు అవసరం. మన దేశంలో కొన్ని రాష్ట్రాల్లో అటువంటి వసతి ఉన్నా, హైదరాబాద్‌కీ ఆ అవసరం ఇప్పుడు కనిపిస్తోంది. కలవారి పిల్లలు మొండిగా ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రమాదాలు కొని తెచ్చుకోకుండా, స్పీడు బైకుల పూర్తి సామర్థ్యాన్ని సంపూర్ణంగా ఆనందించాలంటే ప్రత్యేకమైన ట్రాకులే శరణ్యం.

ప్రమాదాలు ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎలాగైనా జరగొచ్చు. కానీ తెలిసి తెలిసి ప్రమాదాలు కొని తెచ్చుకోవడం మూర్ఖత్వం. సూపర్‌బైకులైనా, సైకిళ్లైనా జాగ్రత్త అవసరం. బాధ్యత అవసరం. మనకోసం ఇంట్లో మన వాళ్లు ఎదురు చూస్తుంటారనే గ్రహింపు అవసరం. ముఖ్యంగా జీవితపు విలువ తెలుసుకోవడం అవసరం. పిల్లలకు ఈ విషయాలు అందవు కాబట్టి పెద్దలే జాగ్రత్త వహించడం అవసరం. ★

సిరిమంతుల తిప్పలు



మిఖాయిల్ ప్రోఖరోవ్

కొత్తగా రాజకీయాల్లోకి రావాలనుకొనే వారు తస్మాత్ జాగ్రత్త. మీకు సలహాలు చెప్పేవారు, మీగురించి లాబీయింగ్ చేసేవారి గురించి తగుజాగ్రత్తలు తీసుకోకపోతే ఇదిగో ఇలాగే అవుతుంది. 'నడమంత్రపు సిరి నరంమీది పుండు మనిషిని ఒక దగ్గర ఉండనివ్వవు'. అడ్డగోలు సిరి వచ్చిన తరువాత దానిని నిలుపుకోవటానికి, ఇంతింతై వటుడింతై అన్నట్లు పెంచుకోవటానికి 'జగ'మంత జన రాజకీయ వ్యాపారానికి పాల్పడటం తెలిసిందే. అందుకోసం పత్రికలు, ఛానళ్లు పెట్టుకోవటం ఒకటైతే 'సలహాలిచ్చేందుకు, రాజకీయ పనికోసం' వ్యక్తులను డబ్బిచ్చి 'కొనుక్కుంటారు' కొందరు. మన రాష్ట్రంలో మాదిరి వారు ఇతర పార్టీల వారు కూడా కావచ్చు. రష్యాలోని బిలియనీర్, ఒన్‌ఎక్సిమ్ గ్రూప్ యజమాని మిఖాయిల్ ప్రోఖరోవ్ అదే పని చేశాడు. రైట్ కాజ్ పార్టీ(న్యాయమైన సమస్యలపై పోరాడే పార్టీ)లో చేరి పార్లమెంట్‌కు పోటీ చేసేందుకు 'తన వంతు' ప్రయత్నాలు ప్రారంభించాడు. అయ్యవారు అంతగొప్పవాడు, ఇంతగొప్పవాడు అని ప్రచారం చేసేందుకు కొంతమంది ఎన్నికల సలహాదారులను, పనివారిని పెట్టుకున్నాడు. వారికి ఒక్కొక్కరికి స్థాయిని బట్టి అంటే ఈలవేసి గోలచేసేవాడు మొదలు, తన జండా పట్టటమే గాక ఎదుటివారి బ్యానర్లను చించేవాడు, ఉపన్యాసాలు రాసిచ్చేవారు ఇలా చేసే పనులను బట్టి కొన్ని వేల నుంచి గరిష్టంగా 20లక్షల రూబుళ్ల(ఒక రూబులు రూపాయన్నరకు సమానం) వరకు ఒప్పందం చేసుకున్నాడు. అయితే ప్రభుత్వంతో ఉన్న రహస్య సంబంధాలు, పార్టీ కంటే తన అభిప్రాయాలే అమలు జరగాలని పట్టుబట్టటంతో ప్రోఖరోవ్‌ను అసలు పార్టీ నుంచే తొలగించారు. రాజకీయంగా నువ్వు ఓల్గాలో మునిగితే మాకేం సైబీరియాలో తిరిగితే మాకేంటి ఒప్పందం ప్రకారం డబ్బు ఇవ్వాల్సిందేనని 'సలహాదారులు' చేసిన డిమాండ్‌ను ప్రోఖరోవ్ తిరస్కరించాడు. దాంతో అతగాడి ఆఫీసు ముందు వారు ధర్నాకు దిగారు. వందమంది పాల్గొన్నారు. తమకు ఇవ్వాల్సిన సొమ్ము మొత్తం ఇవ్వలేదని, ఎంతో కొంత ముట్టి నందుకు సంతోషించండి చాలు వెళ్లమంటున్నారని, అయితే అనుకున్న మేరకు తమకు మొత్తం ఇవ్వాల్సిందేనని ధర్నాలో పాల్గొన్నవారు అంటున్నారు. అయితే తాను వారితో ఒప్పందాలు గట్రా రాసుకోలేదని, నోటిమాటతో మాత్రమే చెల్లింపుల గురించి మాట్లాడుకున్నందున తనపై కేసు దాఖలు చేయలేరని ప్రోఖరోవ్ అంటున్నాడు. మన రాష్ట్రంలో కూడా కొందరు ఎన్నికలలో ఓడిపోయిన తరువాత ఇలానే లబోదిబోమంటున్న పెద్దలున్నారు. అందువలన ఒప్పందాలు రాసుకోవటం, యూనియన్లు పెట్టుకోవటం మంచిదేమో?

అక్కడా అతివలకింతే !!

ఆడది గాబట్టి అలా అయింది అదే మగవాడైతే అంత తేలికగా తొలగించేవారా? అంటే సమాధానం చెప్పటం అంత 'ఈజీ' కాదు. అనాదిగా ఆడవారికి జరుగుతున్న అన్యాయమిదిలే అని నిట్టూర్చటం తప్ప చేయగలిగింది లేదు. ప్రపంచంలో ఇంటర్నెట్‌ను నిర్వహించే బడా సంస్థలలో 'యాహూ' ఒకటి. గత నెలారంభంలో దాని చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా ఉన్న కారోల్ బార్ట్‌జ్ ను ఒక్క ఫోన్ కాల్‌తో ఉద్యోగం నుంచి ఊడబెరికింది యాజమాన్యం. 'ఇల్లు పిల్లలకే పరిమితమైనదే మంచి ఇల్లాలు' అనుకొనే రోజుల నుంచి ఇలాతలంలో అన్ని వ్యవహారాలు అలా అలా చక్కపెట్టే స్థితికి అతివ ఎదిగిందీనాడు. అయినా ఇంకా సంపూర్ణసాధికారత రానందునే అన్యాయానికి గురవుతోంది. అమెరికాలో గతేడాది అండర్‌గ్రాడ్యుయేట్ డిగ్రీలలో 58శాతం మంది యువతులే పొందారు. కాలేజీల్లో 53శాతం మంది ఉన్నారు.గడచిన నాలుగు దశాబ్దాలలో అమెరికాలో అన్ని రకాల ఉద్యోగాలలో మహిళలు 37 నుంచి 48శాతానికి పెరిగారు. అదే జరగకపోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇప్పుడున్నదానికంటే 25శాతం చిన్నదిగా ఉండేదట. అంటే ఆడవారు ఎక్కువ పని చేస్తారని ఒప్పుకున్నట్లే కదా? మరి అలాంటపుడు ఎందుకమ్మా అంత వివక్ష? కనీసం సమాన పనికి సమాన వేతనం కూడా ఇవ్వరు?

గోల్ఫ్ ఆడటానికి ఆంగ్లం అవసరమా?

ఆంగ్లం అవసరమే గాని, అదే సర్వస్వం కాదని గమనించాలి. ఆసియాలో అభివృద్ధి చెందిన ప్రాంతాలలో దక్షిణ కొరియా ఒకటి. దాని విదేశీ వ్యవహారాల శాఖలోని దౌత్య సిబ్బందిలో పదింట నలుగురికి సరైన ఆంగ్లం రాదని వెల్లడైందట. ఇక్కడ మనం ఒక విషయాన్ని చెప్పుకోవాలి. మన లోక్‌సభ స్పీకర్ ఒకాయన ఒక కీలకమైన సమయంలో తనకు అందిన స్లిప్పులోని అంశాన్ని అర్థం చేసుకోవటంలో ఇబ్బంది పడ్డాడు. చట్టసభల్లో స్లిప్పుల మీద పొడిపొడిగా మాత్రమే సందేశాలు రాయటం సాధ్యం అవుతుంది. ఒక సభ్యుడి ఓటింగ్ అర్హత విషయం అది. దానిపై స్పీకర్‌గారికి 'అది మీ విచక్షణ' అన్న సందేశం ఉంది. అయితే దానిని సభ్యుడికి చెప్పాల్సిన సమాధానంగా భావించి సభలో ప్రకటించారు. దాంతో ఆ సభ్యుడు సర్కారుకు వ్యతిరేకంగా ఓటు వేయటంతో ఒక్క ఓటుతో సర్కారు కూలిపోయింది. దక్షిణ కొరియా గతేడాది చేసుకున్న వాణిజ్య ఒప్పందాలలో తప్పులు దొర్లిన కారణంగా వాణిజ్యమంత్రి తన పదవినే కోల్పోవాల్సి వచ్చింది. 'తీగలాగితే డొంకంతా కదిలినట్లు' అర్హత లేకపోయినా సదరు మంత్రిగారి కుమార్తెను కూడా అనువాదశాఖలోకి తీసుకున్నారని తేలిందట. దౌత్యవేత్తలలో కేవలం 1.6శాతం మంది మాత్రమే ఎలాంటి తప్పులు, తడబాట్లు లేకుండా ఆంగ్లం మాట్లాడటం, రాయటం వచ్చినవారున్నారట. ఇరవైఆరుశాతం మంది రాసిన దానిని పరిష్కరించటానికి,అర్థం చేసుకోవటానికి మరికొంతమంది అవసరం అవుతున్నారట. తమ భాషతప్ప ఆంగ్లం అసలు మాట్లాడని దేశాలకు 26 మంది దౌత్యవేత్తలను పంపారట. అక్కడ వారేం చేస్తారంటే. అసలు దౌత్యవేత్తలకు ఆంగ్లం రావాల్సిన అవసరం ఏమిటి? వారి ప్రధాన వ్యాపకం గోల్ఫ్ ఆడటం, దానికి ఆంగ్లంతో పనేమిటని నెటిజన్లు జోకులు వేశారట.

సర్వరోగ నివారిణి

మనకు ఎప్పటి నుంచో తెలిసిన సర్వరోగ నివారిణి 'జిందాతిలిస్మాత్'. ఈ మధ్యకాలంలో టీవీల్లో ఒకాయన 'నీళ్లు తాగితే' సర్వరోగాలూ మాయం అని చెబుతాడు. ఒకరు ఆయుర్వేదంలోనే అన్నీ ఉన్నాయంటారు. ఇలాంటి వారికి తోడు ఇప్పుడు అన్ని అనర్థాలకు మూలం 'అవినీతి' దాన్ని తొలగించాలని చెప్పేవారు బయలు దేరారు. వాషింగ్టన్‌లో జి20 బృంద దేశాల ఆర్థిక మంత్రుల సమావేశం గతనెల 23న జరిగింది. దానికి ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ ఒక విన్నపాన్ని పంపింది. అన్నింటికీ మూలం అవినీతి కనుక దాన్ని నిరోధిస్తే ఆర్థిక సంక్షోభంతో సహా అన్నీ పరిష్కారమౌతాయన్నదే దాని సారాంశం. అరబ్బు విప్లవం, గ్రీస్ సంక్షోభం అవినీతి వల్లే వచ్చిందని పేర్కొన్నది. ప్రభుత్వాలు అనుసరించే విధానాలే అసలు అవినీతికి మూలం, వాటి జోలికి పోకుండా జనాన్ని పక్కదారి పట్టించటమంటే ఇదే.

- ఎం.కోటేశ్వరరావు

ఓ ఉద్యమం విజయవంతం కావడానికి తన వంతు పాత్ర పోషించింది ఒకచోట...ఓ జీవితం అర్థాంతరంగా ముగిసిపోవడానికి కారణమైంది మరోచోట. ఓ హత్యకూ కారణమైంది ఇంకోచోట. ఈ సంఘటనలన్నిటికీ వేదికయ్యింది సామాజిక నెట్వర్కింగ్ సైట్ 'ఫేస్‌బుక్'.

ఫేస్‌బుక్ బహుముఖాలు

"ప్రజలారా... నాకిక ఓపిక నశించింది. నేను తహ్రీర్ స్క్వేర్(విముక్తి కూడలి)కు వెళుతున్నాను"... ఇది ఈజిప్ట్ ప్రజల్లో కదలిక తెచ్చిన సందేశం. 26 ఏళ్ల ఆస్మా మెహ్‌ఫౌజ్ అనే యువతి జనవరి 25కు వారం రోజుల ముందు తన ఫేస్‌బుక్ పేజీలో ఉంచిన ఒక్క పోస్ట్‌తో లక్షల మంది కదిలి తమ దేశ ప్రధానిని దింపేవరకు నిద్రపోలేదు. ఆ ఉద్యమానికి ఊపరి పోసింది ఫేస్‌బుక్కే. అందుకు కృతజ్ఞతగా తమ పిల్లలకు 'ఫేస్‌బుక్' అనే పేరు పెడుతున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు. ఈజిప్టుకు చెందిన జమాల్ ఇబ్రహీం తమకు జన్మించిన పాపకు 'ఫేస్‌బుక్' అని నామకరణం చేశారు. ఆ పాప పూర్తిపేరు 'ఫేస్‌బుక్ ఇబ్రహీం జమాల్'.

ప్రియురాలిని ఒదిలేస్తున్నానని ఫేస్‌బుక్‌లో ఓ యువకుడు చేసిన ప్రకటన ఐఐఎం విద్యార్థిని ప్రాణం తీసింది. జార్ఖండ్‌కు చెందిన మాలినీ ముర్ము (22) బెంగుళూరు ఐఐఎంలో ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె ప్రియుడు అభిషేక్ ఇటీలో ఫేస్‌బుక్‌లో "తమ సంబంధం తెగిపోయిందని, ప్రియురాలిని చెత్తబుట్టలో వేశానని" ఓ మెసేజ్ పెట్టాడు. ఇది చూసిన మాలిని మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడింది.

ఒకటి ఈజిప్ట్‌లో జరిగితే మరోటి బెంగుళూరులో జరిగింది. ఇక ఓ హత్యకు దారితీసిన సంఘటన పెర్‌షోర్‌కి సమీపంలోని బెస్ఫోర్డ్ కోర్ట్ ఎస్టేట్‌లోనిది. హత్య చేసింది సాదాసీదా వ్యక్తేం కాదు. అమెరికాలో బిజినెస్ టైకూన్ 64ఏళ్ల హెరాల్డ్ లాండ్రీ. ఎన్నో వ్యాపార లావాదేవీలు గల లాండ్రీ విశ్రాంతి కోసం తన బిజినెస్ నుండి రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఉబుసుపోక 'ఫేస్‌బుక్' ఓపెన్ చేస్తే బ్రిటన్‌కు చెందిన 38 ఏళ్ల లూసీ పరిచయమైంది. ఎట్టకేలకు ఒక ఇంటి వాడు కూడా అయ్యాడు. ఈ కథ ఇంతటితో క్లైమాక్స్‌కి చేరుకోలేదు. లూసీ 'ఇంటర్నెట్' వ్యవహారాన్ని అలాగే సాగిస్తుందేమోనన్న అనుమానం మొదలైంది లాండ్రీకి. చివరకు అతని అనుమానం నిజమైంది. యధాలాపంగా 'ఫేస్‌బుక్' చదువుతుంటే – లూసీ పాత స్నేహితుడూ మాజీ స్కూల్ ఫ్రెండ్ అయిన జరెత్ జెన్‌కిన్స్‌తో మళ్లీ పరిచయం మొదలైందని తెలిసింది. ఆవేశాన్ని తట్టుకోలేక తన బ్రిటీష్ భార్య లూసీని కత్తితో 23సార్లు పొడవడంతో ఆమె చనిపోయింది. 'ఫేస్‌బుక్' కొన్ని కథల్ని సుఖాంతం చేస్తే – మరిన్ని కథల్ని విషాదాంతం చేస్తుందనటానికి ఇదో తాజా ఉదాహరణ.

విప్లవాలు... విషాదాంతాలకే కాదు... విడాకులకూ కారణమవుతోంది ఫేస్‌బుక్. అమెరికన్లకు ఈ ఫేస్‌బుక్ పెద్ద చికాకుగా మారిపోయింది. అనేకమంది అమెరికన్ల విడాకులకు కారణమవుతోంది. ఈ సోషల్ నెట్వర్కింగ్ సైట్లలో పోస్ట్ చేసే చిలిపి సందేశాలు, ఫొటోల వల్ల అమెరికాలోని ప్రతి ఐదుగురిలో ఒకరు విడాకులు తీసుకుంటున్నట్లు తాజా సర్వేలో వెల్లడైంది.

అమెరికన్ అకాడెమీ ఆఫ్ మ్యాట్రిమోనియల్ లాయర్స్ చేపట్టిన మరో సర్వేలో కూడా 80శాతం మంది లాయర్లు తమ వద్దకు వస్తున్న విడాకుల కేసుల్లో ఎక్కువమంది సోషల్ మీడియాను సాక్ష్యంగా చూపి తమను మోసం చేశారంటూ విడాకుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నట్లు వెల్లడించారు. వీరిలో అత్యధికంగా ఫేస్‌బుక్‌నే ప్రప్రథమ సాక్ష్యంగా ఉపయోగించుకుంటున్నట్లు 66శాతం మంది లాయర్లు చెబుతుండగా, 'మైస్పేస్' 15 శాతం, ట్విట్టర్ 5శాతం, ఇతర సోషల్‌నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు 14శాతం మంది సాక్ష్యంగా వాడుకుంటున్నట్లు లాయర్లు ఈ సర్వేలో తెలిపారు.

ఎంటర్‌టైన్‌మెంట్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఈ సైట్స్‌లో పుకార్లు షికార్లు చేస్తుంటాయి. అసలెవరో నకిలీ ఎవరో అంతుచిక్కదు. దీన్ని కనిపెట్టడం ఐటీ నిపుణులకు కూడా అంతుచిక్కడంలేదు. పర్సనల్ లైఫ్‌తో పాటు వ్యక్తిగత స్వేచ్ఛనూ హరిస్తున్న సోషల్ నెట్‌వర్కింగ్ సైట్స్ సెలబ్రిటీల పేరుతో అనేకం పుట్టుకొస్తున్నాయి. సెలబ్రిటీల దగ్గరనుండి పొలిటీషియన్ల వరకు అందరూ ఈ సైట్స్ బాధితులుగా మారుతున్నారు.

నేటి యువతరం నిజమైన ప్రపంచంలో బతకడం మానేసి, ఊహాజనిత ప్రపంచంలో స్వేచ్ఛగా విహరిస్తోంది. మనల్ని పట్టించుకోని బయటి ప్రపంచాన్ని కాదని, ఆన్‌లైన్ స్నేహితుల్ని నమ్ముకుంటోంది. ప్రతి ఒక్కరికీ తమ అనుభవాలను, అనుభూతులను ప్రపంచంతో పంచుకోవాలని వుంటుంది. కానీ దాని పరిధి ఎంతవరకు, ఏ విషయానికి ఎంత ప్రాధాన్యతనివ్వాలో తెలియని అయోమయ పరిస్థితిలో యువతరం కొట్టుమిట్టాడుతోంది. వ్యక్తిగత విషయాలను సైతం సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో పెడుతున్నారు. సెలబ్రిటీలను చూసి, మీడియా, మీడియాను చూసి సామాన్యప్రజలు.. ఇలా ప్రతి ఒక్కరూ ఈ విషవలయంలో చిక్కుకుంటున్నారు. వాస్తవానికి

సోషల్ నెట్‌వర్కింగ్ ఓ అద్భుతమైన సాంకేతిక పురోగతే. మృగ్యమైపోతున్న మానవ సంబంధాలను చిగురింపచేయడానికి ఇది తనవంతు పాత్ర పోషిస్తోంది. అయితే దాన్ని ఉపయోగించుకునే విధానంపైనే ఫలితం ఆధారపడి వుంటుంది. తమ ఫ్రెండ్స్ లిస్ట్‌లో వేలాదిమంది వున్నారని గర్వంగా చెప్పుకోవడం సెలబ్రిటీలకు ఫ్యాషన్ అయిపోయింది. ఒక అమ్మాయి ఫొటో పెడితే ఒక మంచి కామెంట్ రాసేవారు కొందరైతే, శృతిమించి రాసేవారు మరికొందరు. ఇలా శృతిమించి కామెంట్లు రాస్తున్నా, సదరు వ్యక్తులు సంతోషపడుతుంటారేకానీ, అలాంటి ఫొటోలు పెట్టడం ఆపరు. ఇటీవలి కాలంలో తమ వ్యక్తిగత ఫొటోలను, రకరకాల యాత్రలకు వెళ్ళినప్పటి ఫొటోలను వెనకాముందు ఆలోచించకుండా ఆర్కుట్, ఫేస్‌బుక్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో పెడుతున్నారు. దీనివల్ల తమ ప్రైవసీకి ఎంత భంగం వాటిల్లుతుందనేది ఎవరూ గమనించడంలేదు. ఈ విషయంలో కొంచెమైనా ఆలోచించగలిగితే ఎన్నో రకాల ఇబ్బందులను అధిగమించవచ్చు. ఈ మధ్యకాలంలో కొంతమంది సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు తమ ప్రొఫైల్స్

దొంగిలించబడ్డాయనో, తమ పేర్లతో వేరొకరు చెలామణీ అవుతున్నారనో మీడియాలో ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఫొటోలను వారు పబ్లిక్‌గా పెట్టుకుంటే, ఆ ఫొటోలను వేరొకరు మరోలా ఉపయోగించుకొని వారే అసలు వ్యక్తులుగా చలామణి అవుతున్నవారు అనేకమంది వున్నారు. వెనకాముందు ఆలోచించకుండా సొంత ఫొటోలను పబ్లిక్‌గా వెబ్‌సైట్లలో పెట్టేసి, ఎవరినిపడితే వారిని ఫ్రెండ్స్‌లిస్ట్‌లో యాడ్ చేసుకొని, వారు రాసే కామెంట్లను ప్రోత్సహిస్తూ, ప్రైవసీని పోగొట్టుకోవడం సర్వసాధారణమైపోయింది. సమాజమూ, సాంకేతిక విజ్ఞానమూ అభివృద్ధి చెందుతున్నమాట నిజమే... మరి ఆ సాంకేతిక విజ్ఞానం మనకు, సమాజానికి మంచి చేసేదై వుండాలి కాని, వ్యక్తిగత జీవితాలను, చదివిన చదువుల్ని, రోజువారీ జీవితంలో వ్యక్తిగత స్వేచ్ఛని పోగొట్టుకోవడానికి కాదు. అసలు సామాజిక నెట్‌వర్క్ సైట్ల పట్ల విజ్ఞతతో నడుచుకోకపోతే లేనిపోని అనర్థాలు తలెత్తుతాయి. ముఖ్యంగా సామాజిక నెట్‌వర్కింగ్ సైట్లకు బానిసలై గంటల తరబడి వాటిపైనే గడిపేవారు తప్పనిసరిగా గ్రహించాల్సిన విషయం ఇది. మన ప్రతి రాతకు, ఫొటోకు, వీడియోకు ఎంతోమంది కామెంట్లు రాస్తున్నారని సంతోషపడటం కంటే, మన వ్యక్తిగత విషయాలను ఎవరితో పంచుకుంటున్నాము? అది మన వ్యక్తిత్వానికి భంగం కలగనిరీతిలో వుందా? అనేదే ముఖ్యం.

- కె.ఎక్స్. రాజు

ఈ న్యూస్

గేమింగ్ టాబ్లెట్ 2012

సాంకేతిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మక మార్పులు ఎంటర్‌టైన్‌మెంట్ రంగంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఎదుగుదలతో వీడియో గేమింగ్ వ్యవస్థ మరింత వృద్ధి చెందింది. చిన్నారుల నుంచి పెద్దవారి వరకు ఒళ్లు గగుర్పాటుకు లోనుచేసే వీడియో గేమ్ సంస్కృతి ఇపుడు టాబ్లెట్ పీసీలలోకి విస్తరించనుంది. ప్రముఖ వీడియో గేమ్ రిటైలర్ 'గేమ్ స్టాప్' (Gamestop) 2012లో ఈ ఆవిష్కరణకు శ్రీకారం చుట్టబోతోంది. ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారితంగా రూపుదిద్దుకునే ఈ అత్యాధునిక గేమింగ్ టాబ్లెట్ పీసీ, నిన్టెండో, మైక్రోసాఫ్ట్, సోని, ఆపిల్ వంటి దిగ్గజ శ్రేణులకు పోటీగా నిలువనుంది. 2012లో తాము ప్రవేశపెట్టబోతున్న గేమింగ్ టాబ్లెట్ పీసీ అత్యాధునిక గేమింగ్ ఫీచర్లతో రూపుదిద్దుకుంటోందని 'గేమ్ స్టాప్' సంస్థ చెబుతోంది. గేమింగ్ ప్రియులకు మరింత ప్రయోజనం చేకూర్చే ఈ టాబ్లెట్ పీసీ ఇతర ఫీచర్లు తెలియచేసేందుకు ఆ సంస్థ నిరాకరిస్తున్నప్పటికీ, విశ్వసనీయ సమాచారం మేరకు జీపీయూ పవర్‌హౌస్ వ్యవస్థను ఈ గ్యాడ్జెట్లో పొందుపరిచినట్లు తెలుస్తోంది. గేమింగ్ అనుభూతిని మరింత ఉత్సుకతతో పొందేందుకు టాబ్లెట్ పీసీలో పొందుపరిచిన వైర్‌లెస్ వ్యవస్థ ఆధారితంగా టీవీతో పాటు ఇతర మోనిటర్లకు అనుసంధానం చేసుకోవచ్చని తెలుస్తోంది.



పెరగనున్న నెట్ వినియోగదారులు

2014కి భారత్‌లో 200 మిలియన్ల ఇంటర్నెట్ వినియోగదారులు అదనంగా చేరతారని గూగుల్ అంచనా. అయితే టెలివిజన్, వార్తాపత్రికల ప్రకటనల రెవెన్యూలో ప్రధాన వాటాను కైవసం చేసుకోవడంతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంపై ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తుండటంతో ఇంటర్నెట్ సంస్థల మనుగడ సవాలుగా మారిందని గూగుల్ అభిప్రాయపడుతోంది. టెలికామ్ సంస్థలు అత్యంత వేగవంతమైన వైర్‌లెస్ నెట్‌వర్క్‌పై పెట్టుబడి చేస్తున్నందున 2014కి భారత్‌లో కనీసం 300 మిలియన్ ఇంటర్నెట్ వినియోగదారులు పెరుగుతారని కంపెనీ అంచనా. గూగుల్ అంచనాల ప్రకారం వచ్చే రెండు సంవత్సరాల్లో స్మార్ట్‌ఫోన్ల ధరలు తగ్గనున్నాయని 'ద వాల్ స్ట్రీట్ జర్నల్' తన కథనంలో తెలిపింది. భారత్ ప్రస్తుతం ఇంటర్నెట్ వినియోగంలో చైనా, అమెరికా తర్వాతి స్థానంలో ఉంది.



నాయికల జీవిత చిత్ర మాలిక

సిల్క్ స్మిత జీవితకథ ఆధారంగా తీస్తున్న 'డర్టీ పిక్చర్' ఇప్పుడు సినిమా రంగంలో చర్చనీయంగా వుంది. దక్షిణాది చిత్రాలలో పచ్చి శృంగార నృత్యాలకు మారు పేరుగా ఉపయోగపడిన సిల్క్ స్మిత ఎంత గడించిందో గాని ఆఖరుకు అర్థంతరంగా ఆత్మహత్య చేసుకుని కనుమరుగైపోయింది. ఆవిధంగా విషాదాంతమైన నాయికల జాబితాకు అంతేలేదు. మీనా కుమారి, సావిత్రి, శోభ, ఫటాఫట్ జయలక్ష్మి, విజయశ్రీ.... ఇలా ఎందరినైనా చెప్పొచ్చు. హాలివుడ్‌లోనైతే మర్లిన్ మన్రో మరణం ఎప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయింది. ఇంత దారుణంగా గాకున్నా వ్యాధిగ్రస్తులై మరణించిన మహిళా తారల విషయంలోనూ బోలెడు మానసిక ఘర్షణ, మానవీయ వేదన కనిపిస్తాయి. మరోవైపునుంచి చూస్తే జయప్రద, సబిత వంటి వారిని పూర్వ భర్తలు వేధించి కోర్టులకెక్కిన తీరు కూడా అందరికీ తెలుసు. సబిత కేసులోనైతే హైకోర్టు సంచలన తీర్పునే ఇచ్చింది. తారామణుల ప్రతిభకు ప్రతిబంధకాలుగా తయారైన పురుషుల మూలంగానే ఇన్ని వైపరీత్యాలు సంభవించాయి. అందుకే చిత్ర పరిశ్రమ ఎప్పటికప్పుడు కథానాయికల వాస్తవ జీవితాలను ఆధారం చేసుకుని కథలల్లుతూ వుంటుంది. ఇప్పుడు సిల్క్ స్మిత కథ తీస్తున్నప్పటికీ గతంలోనూ బాగా ప్రసిద్ధి పొందిన ఇలాంటి చిత్రాలున్నాయి.

మీనాకుమారి స్వంత కథ.....
నాయికల నిజ జీవితాల ఆధారంగా తీసిన చిత్రాలలో ముందుగా చెప్పుకోవలసింది మీనాకుమారి పాత్రనే. హిందీ సినిమా రంగానికి మకుటం లేని మహారాణిగా (తెలుగులో సావిత్రిని మించి) వెలుగొందిన మీనా కుమారి అసలు పేరు మహజబిన్ బానో. తల్లిదండ్రులు కూడా సినీ రంగానికి చెందిన వారు కావడంతో ఆమెను బాలతారగా ప్రవేశపెట్టే ప్రయత్నం చేశారు. అప్పట్లోనే ఆమె దర్శక రచయిత కమల్ ఆమ్రోహీ దృష్టిలో పడింది గాని మొదట్లో వీలు పడలేదు. తర్వాత కాలంలో ఆయన ఆమెను గుర్తించడం, అవకాశాలివ్వడం జరిగింది. 1952లో వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు. మీనాకుమారి మొత్తం తొంభై చిత్రాల్లో నటించారంటే ఆమె ఖ్యాతి అర్థం చేసుకోవచ్చు. ఇంతకూ కమల్‌ను పెళ్లి చేసుకున్నాక ఆమె అత్తగారి వూరు ఆమ్రోహీ వెళ్లింది. తమ ప్రేమ కథనే ఇతివృత్తంగా తీసుకుని 'దయారీ' చిత్రాన్ని పెళ్లయిన మరుసటి ఏడాదిలోనే నిర్మించింది. మరో మూడేళ్ల తర్వాత 'పాకీజా' అన్న చిత్రాన్ని మొదలెట్టారు గాని పూర్తి కావడానికి పదహారేళ్ల పట్టింది. కొన్నేళ్లు దాంపత్య జీవితం గడిపాక వారు విడిపోయారు. ఆమె సూపర్ స్టార్ కావడంతో కొందరు కుట్ర పన్ని దూరం చేశారని ఆమ్రోహీ అంటుండేవారు. విడిపోయిన కారణంగా 'పాకీజా' చిత్రం కూడా ఆగిపోయింది. ఈ లోపల జీవిత సమస్యలు తట్టుకోలేని మీనాకుమారి మద్యపానానికి బానిసవడం, ఆరోగ్యం బొత్తిగా క్షీణించి విదేశాలకు వెళ్లి చికిత్స తీసుకోవడం జరిగాయి. మళ్లీ 1971–72 మధ్య ఆమెనే చొరవ తీసుకుని కమల్ ఆమ్రోహీతో మాట్లాడి 'పాకీజా'ను పూర్తి చేశారు. దేశంలో నిర్మాణమైన సంగీత కళాభరిత చిత్రంగా 'పాకీజా' పేరొందింది. అది ఘన విజయం సాధించిన తర్వాత 'పాకీజా2' తీయాలని కూడా మీనాకుమారి ప్రతిపాదించినప్పటికీ ఆరోగ్యం సహకరించలేదు చివరకు ఆమె 1972 మార్చి 31న విషాదకరంగా మరణించింది. కాకపోతే తన ప్రేమ కథను తానే నిర్మించుకున్న నాయికగా మిగిలిపోయింది.

స్మితాపాటిల్...శ్యామ్ భూమిక

తారామణుల జీవితాల ఆధారంగా నిర్మితమైన చిత్రాల్లో బాగా ఆదరణ పొందింది శ్యాం బెనగల్ తీసిన 'భూమిక'. మరాఠీ నాటక సినీ నటి హంసా వాడ్కర్ జీవితకథ ఈ చిత్రానికి ఆధారం. భూమిక అంటేనే పాత్ర. హంసా వాడ్కర్ వివాదాస్పద సంచలన జీవితం గడిపింది. మామూలు మహిళలు పాటించే హద్దులు దాటి తన స్థానం నిలబెట్టుకోవడానికి పెనుగులాడింది. ఈ కథనే శ్యాం బెనగల్ ఎంచుకున్నారు. నాయికగా నటించిన స్మితా పాటిల్ అద్భుత నటన ఆ పాత్రకు ప్రాణం పోసి పురస్కారాల వర్షం కురిపించింది.

బాలివుడ్ నటి ఉష(స్మిత) ఒక సంప్రదాయ గాయని కుమార్తె. ఆ

గాయని వ్యసనపరుడు, దుర్మార్గుడు అయిన ఒక సనాతన బ్రాహ్మణున్ని పెళ్లాడి అనేక కష్టాలనెదుర్కొంటుంది. అతను చనిపోయాక తల్లి వద్దంటున్నా ఉషను సినిమాల్లో వేషాల కోసం ముంబాయి తీసుకుపోతాడు వాళ్లను కనిపెట్టుకుని వుంటున్న నౌకరు కేశవ్ దాల్వీ (అమల్ పలేకర్). అమ్మమ్మ ఆనందం, అమ్మ ఆవేదనల మధ్య ఉష నటిగా మారుతుంది. చిన్నప్పటి నుంచి తనపై కన్నేసిన కేశవ్‌నే పెళ్లి చేసుకుంటుంది. కొంత అనివార్యంగా కొంత అభిమానంగా. ఈ పెళ్లి తల్లికి ఇష్టం లేకున్నా ఉష ఎదిరించి చేసుకుంటుంది. అయితే అతను భర్తగా గాక నౌకరుగానే వ్యవహరిస్తూ తన వల్ల ఆర్థిక లాభమే ఆశిస్తున్నాడని అనతి కాలంలోనే అర్థం చేసుకుంటుంది. కేశవ్ అనేక వ్యాపారాలు చేసి విఫలమై చివరకు ఆమెకు తార్పుడుగాడుగా తయారవుతాడు. హీరో రంజన్ (అనంత నాగ్)కు ఆమెను దగ్గర చేయాలని ప్రయత్నించి మళ్లీ తనే అసూయకు గురవుతాడు. ఈ ఘర్షణ భరించలేని ఉష ఏదో లోకంలో వున్నట్టుండే స్వార్థపర దర్శకుడు సునీల్ వర్మ (నసీరుద్దీన్ షా)కు కాస్త దగ్గరవుతుంది గాని ఆమె ఘర్షణ తగ్గదు. తర్వాత వినాయక్ కాలే (అమ్రిష్ పురి) అనే కోటీశ్వరుడికి అనధికార ద్వితీయ కళత్రమై కొంత గౌరవం పొందాననుకుంటుంది. కాని ఆ ఇంట్లో తనకు స్వేచ్ఛా స్వంతత్రాలు బొత్తిగా లేవని, కాలే వన్నీ బూటకపు మర్యాదలనీ తెలిసి మళ్లీ గతిలేక కేశవ్ ద్వారానే అక్కడి నుంచి బయటపడుతుంది. "పడక మారుతుంది, వంటిల్లు మారుతుంది. మగాళ్ల ముసుగులు మారతాయి. కాని మగాళ్లు మాత్రం మారరు." అని కేశవ్ భార్య అంటుండగా మళ్లీ పాత జీవితంలోకి ప్రవేశిస్తుంది.

ఈ చిత్రం 1978లో స్మితా పాటిల్‌కు జాతీయ ఉత్తమ నటి అవార్డు తెచ్చిపెట్టడమే గాక శ్యాం బెనగల్, గిరీష్ కర్నాడ్, సత్యదేవ్ దూబేలకు ఉత్తమ స్క్రీన్‌ప్లే పురస్కారంకూడా తెచ్చింది.

సిల్క్ స్మిత జీవితమే 'డర్టీ పిక్చర్'

ఇప్పుడు ఏక్తా కపూర్, మిలన్ లూథ్రియాలు దక్షిణాది తార సిల్క్ స్మిత కథపై తీస్తున్న 'డర్టీ పిక్చర్'లో నాయికగా విద్యా బాలన్ నటిస్తుంది. గతంలో పాప వంటి చిత్రాల్లో గంభీరమైన పాత్రలకు పేరొందిన విద్యాబాలన్ స్మితగా నప్పుతుందా ఆమె ఆకారం అలా వుంటుందా వగైరా సందేహాలు కొందరు వ్యక్తం చేసినా విద్య వాటన్నిటినీ కొట్టిపారేస్తున్నది.

స్మిత అసలు పేరు విజయలక్ష్మి. నైలెక్స్ నళిని, ఫటాఫట్ జయలక్ష్మి లాగే సిల్క్ స్మిత అన్నది కూడా ఆమెను పాపులర్ చేయడానికి తగిలించిన పేరు. నల్లగా లావుగా వుండే 'సిల్క్' లేని కమర్షియల్ చిత్రాలే ఒకప్పుడు దక్షిణాదిన వుండేవి కావు. హీరోను చూసి గాక సిల్క్ డాన్సు

స్మితా పాటిల్

నెంబర్ వుందో లేదో తెలుసుకున్నాకే బయ్యర్లు కొంటారని అంటుండేవారు. ఆమె పారితోషికం కూడా చాలా భారీగా వుండేది. 'వసంత కోకిల, సీతాకోక చిలుక, బావ – బావ మరిది...' వంటి ఎన్నో చిత్రాలు ఆమె చుట్టూ తిరిగాయి కూడా. అయితే ఇంతటి ప్రసిద్ధి గల ఆమె నిజ జీవితం మాత్రం బాధామయం. చిన్న చిన్న పాత్రలు వేసే రోజుల్లో ఆమెను గుప్పిట్లో పెట్టుకున్న మూర్తి అనే ఆసామి తర్వాత కాలంలోనూ వేధిస్తూ డబ్బు గుంజుతుండేవాడు. పదేళ్ల పాటు కనకవర్షం కురిపించిన ఆ తారను అనునిత్యం వేధిస్తుండేవాడట. తట్టుకోలేక ఆమె అనేక సార్లు ఆత్మహత్యా యత్నాలు కూడా చేసింది. చివరకు విషాదకరంగా ఉరి వేసుకుని మరణించింది.

సిల్క్ స్మిత పాత్ర వేయడం తనకేమీ కష్టంగా లేదని విద్యాబాలన్ ధీమాగా చెబుతున్నది. ప్రేక్షకులకు తెలిసిందల్లా ఆమె డాన్సులు, పాటలే. ఆమె మ్యానరిజమ్స్ కూడా వారు పూర్తిగా గమనించి వుండరు. ఏ ఇందిరాగాంధీ పాత్రనో వేయాలంటే ఆమె గురించిన ప్రతి విషయమూ ప్రజలకు తెలిసి వుండే అవకాశం వుంది. అమితాబ్ బచన్ వేషం వేయాలన్నా అంతే కష్టం. కాని సిల్క్ స్మిత విషయానికి వస్తే ఆ సమస్యలేమీ వుండవు. ఆమెను గురించి నేను ఏమనుకుని ఎలా నటించాలనుకున్నానో అలాగే నటించేస్తాను అన్నారు విద్య. సిల్క్ జీవితాన్ని ప్రభావితం చేసిన ముగ్గురు పురుషులుగా నసీరుద్దీన్ షా, తుషార్ కపూర్, ఇమ్రాన్ హస్మీ నటిస్తున్నారు.

అన్నట్టు విద్యా బాలన్ గతంలోనూ నిజ జీవిత పాత్ర ధరించకపోలేదు. 'నో బడీ కిల్డ్ జెస్సికాలాల్' అన్న చిత్రంలో ఆమె అక్క షబ్రినాలాల్ పాత్ర పోషించింది.

నాయిక శారదనా శీలానా?

ఇప్పుడు మళయాలంలో జయరాజ్ రూపొందిస్తున్న 'నాయిక' చిత్రం కూడా అమితాసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రం మూడు సార్లు ఊర్వశి పురస్కారం పొందిన శారద కథ అని అనుకుంటున్నారు. తెలుగు తార అయినప్పటికీ మళయాల చిత్రాల ద్వారా జాతీయ కీర్తి నార్జించిన శారద ఆ పిమ్మటే ఇంట గెలిచారు. శారద జీవితం కూడా పూలపాన్పు కాదు. మొదట్లో హాస్య పాత్రలలో కనిపించిన శారద 'తులాభారం' (తెలుగులో మనుషులు మారాలి) తర్వాతనే తారాపథం చేరుకోగలిగారు. హాస్యనటుడు చలం ను పెళ్లి చేసుకున్న శారద చాలా చేదు అనుభవాల తర్వాత విడిపోయారు. గ్లామర్ తార కాకున్నా 70, 80 దశకాలలో శారద ఒక ప్రత్యేక స్థానం పొందారు. క్రాంతికుమార్ శారద తర్వాత మహిళా ప్రధాన పాత్రల్లో శోభన్‌బాబుతో పలు చిత్రాల్లో నటించడమే గాక 'ప్రతిధ్వని' తర్వాత నాయికా ప్రధాన పాత్రలకు మారుపేరుగా వెలుగొందారు. హక్కుల కోసం పోరాడే మహిళ అంటే శారద అన్న పేరు పొందారు. అలాంటి ప్రముఖ నటి కథ అంటే అందరిలో ఆసక్తి రేకెత్తింది. అయితే అందులో నిజం లేదని శారదతో సహ సంబంధిత వ్యక్తులందరూ ఖండించారు. ఎన్టీఆర్‌తో 'భలేతమ్ముడు, నేనే మొనగాణ్ణి' వంటి చిత్రాలలో నటించిన మళయాల తార శీలా కథ ఆధారంగా 'నాయిక' రూపొందుతున్నదట. పద్మప్రియ ఈ పాత్రను పోషిస్తున్నారు. శారద కూడా ఇందులో నటిస్తున్నారు. శర్వానంద్, జయరామ్, మమతా మోహన్‌దాస్ ఇతర పాత్రధారులు.

తెలుగులో ఇలాంటి చిత్రాలు సూటిగా తీసిన ఉదాహరణలు లేవు గాని 'సీతామాలక్ష్మి', అంతకన్నా ఎక్కువగా 'శివరంజని' చిత్రాల్లో నాయికలను వెంటాడే శాడిస్టుల కథలను చూపించారు. అయితే అవి కూడా సంసార పక్షంగా తీయడమే తప్ప భూమికలో వలె ఆఫ్ బీట్ తరహాలో ప్రయత్నించే సాహసం జరగలేదు. ఇక ముందు కూడా జరక్కపోవచ్చు. ఎందుకంటే ఫార్ములా వలయాన్ని ఛేదించడానికి మన పరిశ్రమ నియమాలు బొత్తిగా అంగీకరించవు. పైగా హీరోల కథలను తీసినప్పుడు గొప్పగానే వుంటుంది. నాయికలపై కేంద్రీకరిస్తే హీరోలు బొత్తిగా ఒప్పుకోకపోవచ్చు. అదీ సంగతి. తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమైన సిల్క్ స్మిత కథ ఇప్పుడు ఎలా తీస్తారో చూడాల్సిందే. కొద్ది కాలంలోనే అన్ని భాషల చిత్రాలను వూపేసిన దివ్య భారతి కథ కూడా మర్చిపోవలసింది కాదు. ఎంతైనా ఇది పురుషాధిక్య ప్రపంచం గనకే నాయికల కథలే సినిమాలవుతుంటాయి. అందులో ఆవేదనతో పాటు ఆకర్షణా వుంటుందనే అంచనాతో.

- పీపీ

సుడోకు నింపేద్దాం

నేస్తాలూ.. ఇక్కడ ఓ పెద్ద బాక్సు, అందులో తొమ్మిది చిన్న చిన్న బాక్సులు ఇచ్చాం. వాటిలో మళ్లీ తొమ్మిది గళ్లు ఉన్నాయి. కొన్ని గళ్లలో అంకెలు కూడా వున్నాయి. మీరేం చేయాలంటే చిన్న బాక్సుల్లో 1 నుండి 9 వరకు అంకెలు వేయాలి. వేసిన అంకె మళ్లీ వేయకూడదు. అలా తొమ్మిది చిన్న బాక్సులు నింపేయాలి.

4				1			5	8
					8		7	
				5		6		2
7		9		4		3		
		4				7		
		3		8		2		5
5		6		7				
	2		5					
9	4			3				6



ఆకులపై నడిచే పక్షి

ఈ రోజు చెప్పకోబోయే పక్షి పేరు కంచు రెక్కల జకానా. దీన్ని మీరూ చూసే వుంటారు. చెరువుల దగ్గర కనిపిస్తుంది. ఒంటరిగా కాదు సుమా! గుంపుగా. పొడవాటి కాళ్లు బూడిద రంగులో ఉంటాయి. తల, మెడ, ఉదర భాగం నిగనిగలాడే నలుపు రంగులో ఉంటాయి. తోక ఎరుపు రంగులో చాలా చిన్నగా ఉంటుంది. కంటి వెనుకభాగం నుండి మెడ వరకు వెడల్పుగా తెల్లటి చార ఉంటుంది. నీళ్లల్లో మునుగుతుంది, ఈదుతుంది. కానీ ఎక్కువ సేపు ఎగరలేదు. ఎగిరేటప్పుడు దాని బలహీనమైన కాళ్లను వెనక్కి వేలాడేస్తుంది. ఈ పక్షి చిన్నగా ఉన్నప్పుడు తెలుపు, ఎరుపు, ఎరుపు కలిసిన గోధుమ రంగులో ఉంటుంది. చెరువులు, బురద నేలల్లో తిరగడానికి అనువుగా దీని కాలివేళ్లు పొడుగ్గా ఉంటాయి. నీళ్లల్లో తేలుతున్న ఆకులపై కూడా ఇది నడవగలదు. నీటి మొక్కల వేర్లు, నీళ్లలో ఉండే కీటకాలు, నత్తలు దీని ఆహారం.

'జెముడుతోక జకానా' అనే పక్షి కూడా ఈ జాతికి చెందినదే. ఈ రెండింటి అలవాట్లు ఒకటే. కాకపోతే జెముడుతోక జకానా తోక కొడవలి ఆకారంలో మొనదేలి ఉంటుంది.



క్విజ్‌మాస్టర్

1. టెలిఫోన్ కనుగొన్నదెవరు?
2. పెన్సిలిన్ కనుగొన్నదెవరు?
3. విద్యుత్ కనుగొన్నదెవరు?
4. ప్రింటింగ్ మిషన్ కనుగొన్నదెవరు?
5. టీవీ కనుగొన్నదెవరు?

- ఇంజమామ్ షరీఫ్, హైదరాబాద్

జవాబులు : 1. అలెగ్జాండర్ గ్రహంబెల్, 2. అలెగ్జాండర్ ప్లెమింగ్, 3. బెంజిమన్ ఫ్రాంక్లిన్, 4. జాన్ గుటెన్ బర్గ్, 5. ఫిలో ఫ్రాన్స్ వర్త్

మీరూ ఇలా 5 ప్రశ్నలు, జవాబులు రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా : క్విజ్ మాస్టర్, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

తడవకుండా తీయగలరా?

పిల్లలూ... నీళ్లలో ఉన్న రూపాయి బిళ్లని చేతికి తడి అంటకుండా బైటికి తీయగలరా?



జవాబు : తీయొచ్చు. ఎలా అంటే... ఒక పళ్లెంలో ఓ గ్లాసు నీళ్లు పొయ్యండి. అందులో రూపాయి నాణెం వెయ్యండి. ఒక గ్లాసులో మండుతున్న కాగితాన్ని వెయ్యాలి. గ్లాసు వేడెక్కాక పళ్లెంలో ఉన్న నీళ్లలో ఈ గ్లాసుని బోర్లించాలి. కాగితం మొత్తం కాలిపోయాక గ్లాసు చల్లబడుతుంది. అప్పుడు పళ్లెంలోని నీళ్లన్నీ గ్లాసులోకి వెళ్లిపోతాయి. రూపాయి బిళ్ల మాత్రమే పళ్లెంలో మిగులుతుంది. ఇప్పుడు చేతికి తడి అంటకుండా రూపాయిని బైటికి తీయొచ్చు.

దీనికి కారణం ఏంటంటే... వేడి చేసినప్పుడు అన్ని వస్తువుల్లాగే గాలి కూడా వ్యాకోచం చెందుతుంది. అందుకే మండుతున్న కాగితాన్ని గ్లాసులో వేయగానే అందులోని గాలి వ్యాకోచం చెంది బయటికి వెళ్తుంది. మంట ఆరిపోగానే గ్లాసు చల్లబడుతుంది. అందులోని గాలి పీడనం, బయటి పీడనానికి సమానంగా ఉండదు. బయట గాలిలో ఉండే ఒత్తిడి నీటిమీద కంటే ఎక్కువగా ఉంటుంది. దాంతో నీటిమీద ఒత్తిడి పెరుగుతుంది. ఫలితంగా నీరు గ్లాసులోకి చేరుతుంది.

అది ఏది?

చిన్నారులూ...కిందున్న ఐదు బొమ్మల్లో ఒక్కటి మాత్రం మిగతా వాటితో కలవదు. ఏంటది?



ఏంటవి?

చూడండి పిల్లలూ... కింద పది వస్తువులున్నాయి. వీటిని ఐదు జతలుగా కలపాలి. ఏఏ వస్తువులను జత చేయవచ్చో చూడండి.



ఎలా చేస్తే వస్తుంది?

ఫ్రెండ్స్... పైన కొన్ని గుర్తులు, అంకెలు ఉన్నాయి. వాటి సాయంతో 34+31-16=70X7 అని చూపించాలి. అది ఏ వరుసలో చేస్తే వస్తుందో చేసి చూడండే!

జవాబులు

ఎలా చేస్తే వస్తుంది?

సుడోకు నింపేద్దాం

4	3	2	6	1	7	9	5	8
6	9	5	3	2	8	1	7	4
8	7	1	9	5	4	6	3	2
7	8	9	2	4	5	3	6	1
2	5	4	1	6	3	7	8	9
1	6	3	7	8	9	2	4	5
5	1	6	4	7	2	8	9	3
3	2	8	5	9	6	4	1	7
9	4	7	8	3	1	5	2	6

ఏంటవి?: 1+9, 2+6, 3+7, 4+10, 5+8



బీట్‌రూట్ చట్నీ

కావలసిన పదార్థాలు

బీట్‌రూట్ - అరకిలో, చింతపండు - కొద్దిగా
పసుపు - చిటికెడు, ఎండుమిర్చి - 10
ఆవాలు - 1 స్పూను, ఉప్పు - తగినంత
ఇంగువ - కొద్దిగా, మినప్పప్పు - 1 స్పూను
కరివేపాకు - 1 రెమ్మ, నూనె - 4 స్పూన్లు

తయారు చేసే విధానం

బాండీలో ఒక స్పూను నూనె వేసి కాగాక ఆవాలు, మెంతులు, ఎండుమిర్చి, ఇంగువతో తాలింపు వేసుకుని పక్కన పెట్టుకోవాలి. సన్నగా తురిమిన బీట్‌రూట్‌ని కొద్దిగా నూనె వేసి పచ్చివాసన పోయేదాక వేయించాలి. ఇది చల్లారాక మిక్సీ వేసుకోవాలి. అందులోనే ఉప్పు, పసుపు, నానబెట్టిన చింతపండు గుజ్జు, ముందుగా తాలింపు వేసుకున్న మిశ్రమాన్ని ఇందులో వేసి మళ్లీ ఒకసారి మిక్సీ వేసుకోవాలి. దీన్ని మినప్పప్పు, ఆవాలు, కరివేపాకుతో తాలింపు వేసుకుంటే చాలు. బీట్‌రూట్ చట్నీ రెడీ. ఇది చపాతీ, పూరీల్లోకి చాలా బాగుంటుంది. వేడి వేడి అన్నంలోకి కూడా.

చింతపండు చట్నీ

కావలసిన పదార్థాలు

చింతపండు - 50 గ్రాములు, ఎండుమిర్చి - 10
మినప్పప్పు - 3 స్పూన్లు, నువ్వులు - 3 స్పూన్లు, ఉప్పు - తగినంత
ధనియాలు - 2 స్పూన్లు, ఎండు కొబ్బరి పొడి - 2 స్పూన్లు
బెల్లం పొడి లేదా పంచదార - 2 స్పూన్లు, నూనె - 2 స్పూన్లు

తయారు చేసే విధానం

ముందు చింతపండును నానబెట్టాలి. మినప్పప్పు, నువ్వులు, ధనియాలు విడివిడిగా వేయించి పొడి చేసుకోవాలి. కొద్దిగ నూనెలో ఎండుమిర్చి వేయించి పొడి చేయాలి. దీనిలో చింతపండు రసం, మినప్పొడి, నువ్వుల పొడి, ధనియాల పొడి, కొబ్బరి పొడి, బెల్లం, ఉప్పు వేసి మిక్సీ వేసుకుంటే చాలు. ఇష్టమైన వాళ్లు తాలింపు పెట్టుకోవచ్చు. లేదా అలాగైనా వేసుకోవచ్చు. ఇది వేడి వేడి అన్నం, చపాతీ, పూరీ, దోశల్లోకి బావుంటుంది.



క్యాబేజీ చట్నీ

కావలసిన పదార్థాలు

క్యాబేజీ - అరకేజీ, వేరు శనగపప్పు - పావుకప్పు
ఎండుమిర్చి - 10, మినప్పప్పు - 1 స్పూను
శనగపప్పు - 1 స్పూను, ఇంగువ - 1/2 స్పూను
ఉప్పు - తగినంత, ఆవాలు - 1/2 స్పూను
కరివేపాకు - 2 రెమ్మలు, నూనె - 2 స్పూన్లు

తయారు చేసే విధానం

కొద్దిగ నూనెలో వేరు శనగపప్పు, ఎండుమిర్చి వేయించాలి. తర్వాత క్యాబేజీ తురుము పచ్చివాసన పోయేవరకు వేయించాలి. చల్లారిన తర్వాత ఉప్పు కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. బాండీలో కొద్దిగా నూనె వేడి చేసి ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, ఇంగువ, కరివేపాకుతో తాలింపు పెట్టుకోవాలి. చివరిలో మెత్తగా రుబ్బుకున్న మిశ్రమాన్ని కలిపి ఐదు నిమిషాలు ఉడికించాలి. ఇది అన్నంలోకి, ఇడ్లీ, దోశల్లోకి బాగుంటుంది.

క్యాప్సికం చట్నీ

కావలసిన పదార్థాలు

క్యాప్సికం - అరకిలో, ఎండుమిర్చి - 8
శనగపప్పు - 50 గ్రాములు, మినప్పప్పు - 50 గ్రాములు
ఆవాలు - 4 స్పూన్లు, మెంతులు - 1 స్పూను
కరివేపాకు - 2 రెమ్మలు, ఉప్పు - తగినంత
ఇంగువ - 1/2 స్పూను, పసుపు - 1/2 స్పూను
చింతపండు - కొద్దిగా, నూనె - 50 గ్రాములు

తయారు చేసే విధానం

పైన చెప్పుకున్న వాటిలో సగం మినప్పప్పు, శనగపప్పు, ఆవాలు, ఎండుమిర్చి నూనెలో ఎర్రగా వేయించుకోవాలి. చివరిలో కరివేపాకు, ఇంగువ వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని తీసి పక్కన పెట్టుకోవాలి. ఈ సారి నూనె లేకుండా మిగిలిన ఆవాలు, మినప్పపు, శనగపప్పు, మెంతులు, ఎండుమిర్చి వేయించాలి. చల్లారాక పొడి చేసుకోవాలి. బాండీలో మిగిలిన సగం నూనె వేసి క్యాప్సికం ముక్కలు వేయించాలి. ఇందులో తాలింపు గింజల పొడి, చింతపండు, ఉప్పు వేసి మిక్సీ వేసుకోవాలి. దీన్లో ముందు తాలింపు వేసిపెట్టుకున్న మిశ్రమాన్ని కలుపుకుంటే క్యాప్సికం చట్నీ రెడీ.





మెంతి చట్నీ

కావలసిన పదార్థాలు

మెంతికూర కట్టలు - 3, నూనె - 3 స్పూన్లు
ఎండుమిర్చి - 6, ఇంగువ - కొద్దిగా
బెల్లం - నిమ్మకాయంత
చింతపండు - నిమ్మకాయంత
ఉప్పు - తగినంత, పసుపు - కొద్దిగా

తయారు చేసే విధానం

మెంతి ఆకు, ఎండుమిర్చి విడివిడిగా నూనెలో వేయించాలి. చింతపండు నానబెట్టాలి. వేయించుకున్న మెంతిఆకు, ఎండుమిర్చి మెత్తగా గ్రైండ్ చెయ్యాలి. అందులోనే నానబెట్టుకున్న చింతపండు, ఎండుమిర్చి, బెల్లం, ఉప్పు, పసుపు వేసి గ్రైండ్ చెయ్యాలి. అంతే ఘుమఘుమలాడే మెంతి చట్నీ రెడీ. ఇది కూడ అన్నంలోకి, ఏ టిఫిన్‌లోకైనా బావుంటుంది.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీ కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను జతచేసి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండి. మరి మా అడ్రస్

కలంస్నేహం, బాలనేస్తాలు, మోటూరు హనుమంతరావు భవన్, 21/1,

అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: కె.శ్రీను

చదువు: 8వ తరగతి

వయస్సు: 13 సం॥

స్కూలు: జి.హెచ్.ఎస్

లక్ష్యం: డాక్టర్ కావడం

హాబీలు: క్రికెట్, చెస్

చిరునామా: కె.శ్రీను

సన్నాఫ్ : పాండు,

ఫకీర్ నాయక్ తండా,

బిర్కూర్, నిజామాబాద్.

పేరు: జి. తేజస్వి

చదువు: 3వ తరగతి

వయస్సు: 9 సం॥

స్కూలు: భాష్యం పబ్లిక్ స్కూల్

లక్ష్యం: టీచర్ కావడం

హాబీలు: సింగింగ్, డ్రాయింగ్

చిరునామా: జి. తేజస్వి

డాటరాఫ్ : డి. సురేష్‌బాబు,

డోర్.నెం.4-359,

నవభారత్ నగర్, బొమ్మూరు, రాజమండ్రి.

పేరు: బి. ప్రకాష్

చదువు: 10వ తరగతి

వయస్సు: 15 సం॥

స్కూలు: వంశీ హై స్కూల్

లక్ష్యం : టీచర్ కావడం

హాబీలు:చెస్, కరాటే ఆడడం

చిరునామా: బి. ప్రకాష్

సన్నాఫ్ : బి. పిర్య,

గంగారెడ్డి తండా,

వర్ని, నిజామాబాద్.

పేరు: వి. సాయి చరణ్

చదువు: 9వ తరగతి

వయస్సు: 15 సం॥

స్కూలు: దేదీప్య హైస్కూల్

లక్ష్యం: పైలట్ కావడం

హాబీలు: క్రికెట్, డ్రాయింగ్

చిరునామా: వి. సాయి చరణ్

సన్నాఫ్ : వి. హైమా వెంకటేశం

ఇం.నెం.1-7-184,

ఆర్.బి. నగర్, భువనగిరి, నల్లగొండ.

పేరు: కె. అనిల్

చదువు : 9వ తరగతి

వయస్సు : 14సం॥

స్కూలు : జి.హెచ్.ఎస్

లక్ష్యం : టీచర్ కావడం

హాబీలు : క్రికెట్, షటిల్ ఆడడం,

చిరునామా : కె. అనిల్

సన్నాఫ్ : సజన్

ఎస్.టి. బాలుర వసతి గృహం,

రాకాసిపేట్, బోధన్, నిజామాబాద్.

పేరు: డి. మోహన్

చదువు : 10వ తరగతి

వయస్సు : 15 సం॥

స్కూలు: వాసు హై స్కూల్

లక్ష్యం : కలెక్టర్ కావడం

హాబీలు : క్రికెట్, షటిల్ ఆడడం,

చిరునామా : డి. మోహన్

సన్నాఫ్ : విక్టర్

రాంపూర్ తండా,

కోటగిరి, నిజామాబాద్.

జంతు ప్రపంచం

ప్రతి ఒక్కరికీ తమకంటూ ఓ ప్రపంచం వుంటుంది. అందులో అంతా వారికి సంబంధించినవే...వారికి అవసరమైనవే వుంటాయి. మనకే కాదండోయ్! ప్రతి ప్రాణికీ వుంటుంది. ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న జంతువులకు కూడా తమదైన ప్రపంచం వుంది. ఎలుగు, జింక, కుక్క, పిల్లిని చూడండి. వాటి బుల్లి ప్రపంచాన్ని ఎంత సహజంగా ఆవిష్కరించాడో కదా చిత్రకారుడు! తమాషా ఏమంటే అదే అతని ప్రపంచం!!

శ్రీ మహా పోచమ్మ దేవస్థానము

గ్రా॥ఆడెల్లి.మం॥సారంగాపూర్.జి॥ఆదిలాబాద్

శ్రీ మహాపోచమ్మ వారి గంగనీళ్ల జాతర మహోత్సవం

తేది: 01-10-2011 నుండి 02-10-2011 వరకు

1. తేది:01-10-2011 రోజన ఉ॥11-00గం॥లకు శ్రీ మహాపోచమ్మ వారి అభరణాలతో సేవాదారులు గోదావరికి బయలుదేరడం.
2. తేది:02-10-2011 ఆదివారం గోదావరిలో అమ్మవారి అభరణాలు శుభ్రం చేసుకొని వారు తెచ్చిన గంగనీళ్లతో శ్రీ అమ్మవారికి అభిషేకం (పవిత్రోత్సవం) నిర్వహించబడును.

కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించి తరించగలరని కోరుచున్నాము

టి.నారాయణ మేనేజర్ | సిబ్బంది, అర్చకులు | శ్రీ కొత్తపెల్లి మాధవరావు చైర్మన్

ధర్మకర్తలు:-శ్రీగడ్డం గంగాధర్, శ్రీమతి రాజుల సాయమ్మ, శ్రీపల్లెర్ల బక్కన్న శ్రీకొండ్రు గంగారెడ్డి, శ్రీడి.శ్రీనివాస్

గమనిక:-నిర్మల్,బైంసా డిపోల నుండి దేవాలయం వరకు ప్రత్యేక బస్సులు నడుపబడును మరియు పోలీసు బందోబస్తు, వైద్య సౌకర్యం నీటి సౌకర్యం ఏర్పాటు చేయనైనది